నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
1
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

# లోతట్టు ప్రాంతాలపై అవగాహన కలిగి ఉండాలి

**సానిటరీ ఇన్‌స్పెక్టర్లతో బల్దియా కమిషనర్ సమీక్ష**



నవతెలంగాణ-వరంగల్

రానున్న వర్షాకాలం నేపథ్యంలో సానిటరీ ఇన్ స్పెక్టర్‌లకు నగర వ్యాప్తంగా ఉన్న లోతట్టు ప్రాంతాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్లతో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఐటీ నిపుణులు గూగుల్ ఎర్త్ మ్యాపు ద్వారా నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను దృశ్య మాధ్యమం (పవర్ పాయింట్ ప్రజెం టేషన్)ద్వారా ప్రదర్శించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా 66డివిజన్‌లకు చెందిన సానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వారికి కేటాయించిన డివిజన్‌లలో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై పూర్తి పరిజ్ఞానం ఉండాలని సూచించారు. సామర్థ్యం మేరకు నిర్మించని డ్రైన్‌ల సమాచారాన్ని అందించాలని, వర్షాలు కురిసే క్రమంలో నగరంలోని పలు ప్రాంతా ల్లో డ్రైన్ లు పొంగడానికి గల కారణాలు అన్వేషించాలన్నారు. ఆ సమాచారాన్ని గూగుల్ మ్యాప్ ద్వారా సేకరించి అందజేయాలన్నారు.నిత్యం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం 3 దఫాలుగా డంపింగ్ జరగాలని, డ్రైన్ లలో డిసిల్టింగ్ జరిగేలా చూడా లని, ఫాగింగ్ సక్రమంగా జరిగేలా ఎస్ఐ లు పర్య వేక్షణ జరపాలని కమిషనర్ అన్నారు. ఈ కార్య క్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్.రాజేష్ శానిటరీ సూపర్ వైజర్లు సాంబయ్య, నరేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ విత్తనాలపై కొరడా

**నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు**

నవతెలంగాణ-వరంగల్

'తొలకరి జల్లులతో విత్తనాల ధరలు పిరం' అని నవతెలంగాణ దిన పత్రికలో ఇటీవల వార్త వెలువడిన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన అగ్రికల్చర్ జిల్లా అధికారులు స్పందించి మంగళవారం వరంగల్ బస్టాండ్ రోడ్డులోని విత్తన దుకాణాలలో తనిఖీలు నిర్వ హించారు. పలు గోదాములను పరిశీలించి విస్తతంగా తనిఖీలు చేపట్టారు. నవతెలంగాణ పత్రికలో తొలకరి జల్లులతో విత్తనాల ధరలు పిరం అనే కథనం వల్ల అధికారులు తనిఖీలు చే యడం వల్ల తమకు సరసమైన ధరలకు విత్తనాలు లభిస్తాయని భావిస్తూ రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



## సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటించాలి

**ప్రజ్వల్ పియు మేనేజర్ హిమవర్షిణిజి**

నవతెలంగాణ-పర్వతగిరి

రైతులు సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించాలి అని ప్రజ్వల్ పియు మేనేజర్ హిమవర్షిణి తెలిపారు. మండలంలోని నారాయణపురం గ్రామంలో మంగళవారం రైతులకు నేల పునరుత్పాదక వ్యవసాయ విధానంలో భాగంగా ప్రజ్వల్ ఎఫ్‌పిసిఎల్ వారు నిర్వహిస్తున్న రైతు అవగాహన కార్యక్రమంలో పియు మేనేజర్ హిమ వర్షిణి పాల్గొని మాట్లాడారు. రైతులందరూ నేల ఆరోగ్యం, జీవవైవిధ్యం, సుస్థిరతకు ప్రాధాన్యతను ఇచ్చే వ్యవసాయ విధానాన్ని కలిగి ఉండాలని అన్నారు. అందుకు రైతులందరూ నవధాన్యాలు తమ పంట పొలాలలో పచ్చిరొట్టె ఎరువులుగా వేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ప్రధానంగా వర్మి కంపోస్టు, సిటీ కంపోస్టు, చెరువు మట్టి, పెంట మట్టి వేసుకోవడం వల్ల భూసారం పెరిగి నేల ఆరోగ్యాన్ని కాపాడిన వారం అవుతామన్నారు.కార్యక్రమంలో సంస్థ కార్యకర్తలు సైలాబ్‌బాబు, వెంకటలక్ష్మి, కోమల, మౌనిక పాల్గొన్నారు.



## 'మాస్టర్‌మైండ్' యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నర్సంపేట

ప్రభుత్వ నిబంధనలు పాటించని మాస్టర్ మైండ్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పట్టణంలోని మాంటిస్సోరీ స్కూల్ పేరిట అనుమతి ఉండగా మాస్టర్ మైండ్ స్కూల్ పేర ఫ్లెక్సీలు, బ్యానర్‌లు ఏర్పాటు చేసుకొని విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజుల వసూళ్లు చేస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారని తెలిపారు. వెంటనే విద్యాశాఖాధికారులు స్పందించి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చింత సిద్దు, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, రఘు, వినీత్, ఉదయ్య తదితరులు పాల్గొన్నారు.



## రైతుల పొలాలకు మట్టిని తరలించాలి

నవతెలంగాణ-పర్వతగిరి

రైతుల పొలాల్లోకి మట్టిని తరలించాలని వర్ధన్నపేట ఏపీఓ, ఎస్.నాగేశ్వర్ సూచించారు. మండలంలోని కడారిగూడెంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కూలీలకు పలు సూచనలు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు రూ.300 వందల చొప్పున ఇస్తుందని, ప్రతీ కూలీ ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెరువుల్లో తవ్విన నల్లరేగడి మట్టిని రైతుల పొలాల్లోకి తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సంధ్య శంకర్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్,రాజు మరియు కడారి గూడెం, కత్రియాలకు చెందిన ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఏనుమాముల మార్కెట్‌కు 6రోజులు సెలవు

నవతెలంగాణ-కాశిబుగ్గ

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి గురువారం (జూన్ 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు) వరకు వరుసగా ఆరు రోజుల పాటు సెలవు ఉంటుందని మంగళవారం మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి తెలిపారు. శనివారం (జూన్ 1న) వారాంతపు యార్డ్ బంధు, ఆదివారం వారాంతపు సెలవు, సోమ, మంగళ, బుధవారం లోక్ సభ సాధారణ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు, గురువారం అమావాస్య సందర్భంగా మొత్తం ఆరు రోజుల పాటు వరుసగా మార్కెట్ యార్డు బంధు ఉంటుందని తెలిపారు. కాబట్టి సెలవు దినములలో రైతు సోదరులు తమ పంట ఉత్పత్తులను మార్కెటుకు తరలించి ఇబ్బందులు పడవద్దని కోరారు. గురువారం (జూన్ 7న) నుండి మార్కెట్ యార్డులో తిరిగి క్రయవిక్రయాలు పున: ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

# ఎవరి ధీమా వారిదే..

**పట్టభద్రుల నియోజకవర్గంలో తగ్గిన పోలింగ్ శాతం**

**'తీన్మార్'కే విజయావకాశం..?**



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

**నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజక వర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు ఎవరి గెలుపుపై వారు ధీమాలో ఉన్నారు. అయితే ఉప ఎన్నికల్లో ఓటు నమోదుపై అంతగా ఆసక్తి చూపలేదు. అంతేకాదు, ఓటు నమోదు చేసుకున్న వారిలోనూ ఓటు వేసేందుకు ఉత్సాహం చూపకపోవడం గమనార్హం. 2021 ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 5,05,565 మంది పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోగా, తాజా ఎన్నికల్లో మాత్రం కేవలం 4,63,839 మంది పట్టభద్రులు మాత్రమే తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. గతంలో పోలింగ్ శాతం 76.41 శాతం నమోదు కాగా ఈ ఉప ఎన్నికలో 72.44 శాతం నమోదయ్యింది. ఒకవైపు ఓట్లు తగ్గడమే కాకుండా పోలింగ్ సైతం 3.97 శాతం తగ్గింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యనే తీవ్ర పోటీ ఉండగా, మొదటి ప్రాధాన్యతా ఓట్లతోనే విజయం సాధిస్తారని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తుంది.**

నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలో 34 అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. 12 జిల్లాల్లో వ్యాపించి ఉన్న ఈ నియోజకవర్గంలో తాజాగా జరిగిన ఉప ఎన్నికలో పోలింగ్ తగ్గుతుందని ముందుగానే భావించారు. అయితే తగ్గుతుందనుకున్న స్థాయిలో మాత్రం పోలింగ్ తగ్గకపోవడం గమనార్హం. 52 మంది అభ్యర్థులు ఈసారి పోటీలో ఉండగా, ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యే పోటీ నడిచింది. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగిన తీన్మార్ మల్లన్న ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేశారు. 2021 పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో 71 మంది పోటీ చేశారు. ప్రధానంగా నాడు బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి, ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న చింతపండు నవీన్ ఎలియాస్ తీన్మార్ మల్లన్న, టీజేఎస్ అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్ గట్టి పోటీనిచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన సమీప ఇండిపెండెంట్ ప్రత్యర్థి తీన్మార్ మల్లన్నపై 12,866 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

### 'తీన్మార్'కే అవకాశం..?

ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకే విజయావకాశాలున్నట్టు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగిన 'తీన్మార్' ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఈ నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల్లో విస్తరించి ఉన్న 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మెజార్టీగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడం గమనార్హం. గత రెండు ఎన్నికల్లో 'తీన్మార్' ఇండపెండెంట్‌గానే గట్టిపోటీనివ్వడం, నియోజకవర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో పరిచయాలుండటంతో విజయావకాశాలు గణనీయంగా ఉన్నాయని ధీమాతో ఉన్నారు.

### బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పదా..?

గతంలో ఈ నియోజకవర్గంలో వరుసగా నాలుగుసార్లు విజయం సాధించిన బీఆర్ఎస్‌కు ఈసారి భంగపాటు తప్పేట్టు లేదన్న ప్రచారం జరుగుతోంది. తొలుత 2 సార్లు బీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ విజయం సాధించారు. అనంతరం 2 సార్లు పోటీ చేసిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'పల్లా' జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. దాంతో ఆయన తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తన నియోజకవర్గాన్ని నిలబెట్టుకునే అవకాశాలు అరుదనే రాజకీయ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు.

### జూన్ 5న ఓట్ల లెక్కింపు

జూన్ 5న పట్టభద్రుల నియోజకవర్గ ఓట్ల లెక్కింపు నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగనుంది. తొలుత మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కించాక, ప్రాధాన్యత ఓట్లకనుగుణంగా ఎలిమినేషన్ జరుపుతూ ఓట్లను లెక్కిస్తారు. కాంగ్రెస్ పార్టీ మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుంది. బీఆర్ఎస్ గెలుపు మాదేనని చెబుతున్నా, పలువురు సీనియర్లు గట్టి పోటీనిచ్చామని చెబుతున్నారు. ఏదేమైనా జూన్ 5న పట్టభద్రుల తీర్పు వెలువడనుంది.

# దూపతండాలో ఇసుక అక్రమ దందా...

**ఓ కాంట్రాక్టర్ యథేచ్ఛగా డంపింగ్ చేస్తున్న వైనం**

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ శివారు ధూపతండాకు చెందిన ఓ కాంట్రాక్టర్ ఆకేరు వాగు నుంచి చాలా రోజులుగా ఇసుక అక్రమ దందా నిర్వహిస్తున్నారు. వాగులో పెద్దపెద్ద జెసిబిలతో ట్రాక్టర్ల సాయంతో అక్రమార్కులు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో పాటు వాగు సమీపంలో పెద్ద ఎత్తున డంపింగ్ చేస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఇసుక దందా నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రావూరు శివారులో కొంతకాలంగా ఆకేరు వాగు పై కాజువే నిర్మిస్తున్న ఓ కాంట్రాక్టర్ ఈ ఇసుక అక్రమ రవాణాతో పాటు, వాగు సమీపంలో పెద్ద ఎత్తున డంపింగ్ నిర్వహిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తుండడంతో అటువైపు వెళ్లే రైతులు ఇసుక వాహనాల రాకపోకలతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక అక్రమ దందాతో లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని వాపోతున్నారు. అంతేగాక ఇసుక



ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు సైతం ఎన్నో ఉన్నాయని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని, రవాణాకు పాల్పడుతున్న వాహనాలను జేసీబీని సీజ్ చేయాలని తండావాసులు, స్థానికులు కోరుతున్నారు.ఈ విషయమై తహసిల్దార్ టి. వెంకటస్వామిని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని పూర్తి స్థాయిలో విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై, వాహనాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# కోళ్ల ఫామ్ నిర్మాణాన్ని నిలిపేయాలి

**- నిర్మాణ స్థలం వద్ద స్థానికుల ఆందోళన**

**- జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందజేత**

నవతెలంగాణ-రాయపర్తి

స్వచ్ఛమైన వాతావరణంలో జీవనాన్ని కొనసాగిస్తున్న తమకు కోళ్ల ఫామ్ ప్రకతికి యమపాశంగా మారనుందని దాంతో స్థానికంగా ఉండే తమకు అనేక ఇబ్బందులు వస్తాయని పన్యా నాయక్ తండా ప్రజలు మంగళవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లో వెళితే స్థానిక ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పన్యా నాయక్ తండా సమీపంలో భారీ నిర్మాణంతో కోళ్ల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కోళ్ల ఫామ్ వల్ల స్వచ్ఛమైన వాతావరణం కలుషితమవుతుంది అని బాధపడుతున్నారు. ఫామ్ నుంచి వచ్చే వ్యర్థాల ద్వారా గాలి, నీరు కాలుష్యమై పర్యావరణం దెబ్బతింటుందని దాంతో తండా ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తండావాసుల అభిప్రాయాలు తెలుసుకోకుండానే కోళ్ల ఫామ్ నిర్మాణం చేపట్టడం సరికాదని వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ముక్తకంఠంతో వ్యాఖ్యానించారు. కోళ్ల ఫామ్ నుంచి వచ్చే దుర్గంధమైన వాసన, దోమలు, ఈగలు తమ ఇళ్లల్లో వాలి చికెన్ గునియా, బర్డ్ ఫ్లూ, డెంగు లాంటి భయంకరమైన వైరస్ లు ప్రబలి తమ ప్రాణాలకే ప్రమాదం ఏర్పడనుందని



ముందు జాగ్రత్తగా నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆందోళన చేపడుతున్నట్లు వారు గోడును వెళ్లబుచ్చుకున్నారు. కోళ్ల ఫామ్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని తండాలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్య మహేందర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రామ సర్పంచ్ భూక్యా వెంకట్రాం, మాజీ ఎంపీటీసీ భూక్యా క్రాంతి, నాయకులు డాక్టర్ భూక్యా రాజారాం నాయక్, భూక్యా రాజు, బదావత్ వీరన్న, భూక్యా కమల్ సింగ్, మూడు బాలాజీ, భూక్యా రవి, భూక్యా యాకు, భూక్యా నరసింహ, మాలోత్ సురేందర్, అంగోతు వెంకన్న, నూనావత్ స్వామి, భూక్యా లక్ష్మి, భూక్యా సుగుణమ్మ, భూక్యా రంజిత తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ చేసి ఖరీఫ్‌కు విత్తనాలు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నర్సంపేట

రుణమాఫీ అమలు చేసి ఖరీఫ్ సీజన్‌కు రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో అడ్డూరి రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సదానందం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దశాబ్ది కాలంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు 40శాతం సబ్సిడీ ఇచ్చామని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసి వ్యవసాయ రంగాన్ని నాశనం చేసిందన్నారు. సబ్సిడీలు రద్దు చేసి వ్యవసాయాన్ని నుంచి దూరం చేసిందని తెలిపారు. మరో వైపు కిందటి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు సర్వరోగ నివారిలా చూపిస్తూ దగా చేసిందన్నారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, రుణాలు, ఎరువులు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ధాన్యంపై రూ.500ల బోనస్ ఇవ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రైతులు పండించిన పంటపై గిట్టుబాటు ధర



కల్పించాలన్నారు. ఇందుకోసం భవిష్యత్ పోరాటాలు చేపడుతామని తెలిపారు. ఈ నెల 30న మహేశ్వరం గ్రామంలో నిర్వహించనున్న రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి చిర్ర సూరి, జిల్లా కమిటీ సభ్యులు మైదం పాణీ, లాల్, మనోహరచారి, రాజేందర్, శ్రావణ్, మురళి,గోపి తదితరులు పాల్గొన్నారు.



## బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్‌లు కల్పించాలి

నవతెలంగాణ-నర్సంపేట

బీసీల జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గురుమిళ్ల రాజు, సావిత్రి బాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గన్నారపు సరోజన డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమ్మరికుంటలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనాభాలో బీసీల గణన చేయకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బీసీలలో అనేక కులాలు నేటికీ దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని వారి స్థితిగతులు మారడానికి జనాభా ఎంతో ఉందో వాటా కూడా అంతే దక్కాల్సిన అవసరం ఉంద న్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి సముచి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.చక్రవర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, హనుకొండ జిల్లా కన్వీనర్ తంపుల మొగిళి, చైతన్య భారతి, ఈ.సైదమ్మ, బత్తు విజయ, నారాయణపేట జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఎర్ర మోహనకృష్ణ, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళాలు

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ భక్తాంజనేయ స్వామి గుడి నిర్మాణం కోసం ధమ్మిశెట్టి నవతకోటి దంపతులు రూ.10,116, మూడ్ బాలాజీ-శ్రీలత దంపతుల కుమారుడు హనుమంతు మంగళవారం రూ.5016 లు ఆలయ కమిటీ నిర్వా హకులకు అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
హనుమకొండ
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

# చెరువు శిఖ భూములను కాపాడాలి

## తహసీల్దార్‌కు రైతుల వినతి



**నవతెలంగాణ-ఆత్మకూరు**

మండలంలోని హౌజుబుజుర్గు, టాక్షపూర్ మహ్మద్ గౌస పల్లి గ్రామ శివారులోని చెరువు శిఖం యథేచ్ఛగా కబ్జాకు గురవుతుందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కబ్జాదారుల నుంచి శిఖం భూములను రక్షించాలని కోరుతూ మంగళవారం హౌజుబుజుర్గు గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువు అయకట్టులోని గ్రామాలు కటాక్షపూర్, హౌజుబుజుర్గు, నీరుకుళ్ల, రేశకుంట, నందిగామ, నేరేడుపల్లి పత్తిపాక,గొల్లపల్లి గ్రామాలకు1500 ఎకరాలకు గాను రెండు పంటలకు సరిపోయే నీరు కటాక్షాపూర్ చెరువు నుండి పారకం జరుగుతుందని, అలాంటి చెరువు కబ్జాకోరల్లో చిక్కుకోవడంతో పొలాలకు నీరు అందడం లేదని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కటాక్షపూర్ శివారులోని చెరువును ఆనుకొని డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, ఉమేష్ చంద్ర, పంచగిరి భాస్కర్, పంచగిరి కేధారి, వక్కల కిషన్, వక్కల గోపి, సురేందర్ గౌడ్, మంద లింగయ్య, కొప్పులపల్లి లక్ష్మణరావు చెరువును కబ్జా చేశారని ఆరోపించారు. కటాక్షపూర్ చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి కటాక్షపూర్ చెరువును సర్వే చేయించి హద్దులు నిర్ణయించి కబ్జా నుండి కాపాడాలని వారు డిమాండ్ చేశారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల గ్రామ ప్రజలంతా కలెక్టర్లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజుబుజుర్గు గ్రామ రైతులు మొగిలిచర్ల వీరస్వామి, మార్క రజనీకర్ గౌడ్, షేక్ కాసిం, సయ్యద్ మహమూద్, షేక్ సలీం పాషా, పిట్టల రాజు, షేక్ ఉమర్, దినేష్, షేక్ నెమత్ పాల్గొన్నారు.



## ఆకలి రహిత ప్రపంచమే 'మలబార్ గ్రూప్' లక్ష్యం

### మలబార్ గోల్డ్ డైరెక్టర్ అజీష్‌అహ్మద్

**నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా**

ఆకలి రహిత ప్రపంచం సాధనే మలబార్ గ్రూప్ లక్ష్యమనిమలబార్ గోల్డ్ డైరెక్టర్ అజీష్‌అహ్మద్ అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షో రూమ్‌లో వరల్డ్ హంగర్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ట్రాఫిక్ ఏసీపీ టి సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ నాగబాబు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ అజీష్ అహ్మద్ మాట్లాడుతూ నిరుపేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రతిరోజూ 51,000 పోషకాహార ప్యాకెట్లను పంపిణీ చేయడానికి సంస్థ నిర్ణయించిందని, ప్రస్తుతం 31,000 ఆహార ప్యాకెట్లను పంపిణీ చేయనున్నట్టు డైరెక్టర్ అజీష్ అహ్మద్ తెలిపారు. అనంతరం సీఈవో ఎంపి అహ్మద్ మాట్లాడుతూ ప్రపంచం నుండి ఆకలిని తరిమివేయడానికి కషి చేస్తున్న ప్రభుత్వాలు, ఏజెన్సీలకు మద్దతుగా తాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.

మార్కెటింగ్ మేనేజర్ వంశీ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్లో అత్యంత గుర్తింపు పొందిన ఎన్, జి, ఓ 'థనల్- దయా రిహాబిలిటేషన్ ట్రస్ట్' సహాయంతో 'హంగర్ ఫ్రీ వరల్డ్ ప్రోగ్రామ్' అమలు చేయబడుతుందన్నారు. మలబార్ గ్రూప్, థనల్ వాలంటీర్లు వీధులు, పట్టణ శివారు ప్రాంతాలలో నిరుపేదలను గుర్తించి, ఆహార ప్యాకెట్లను వారి ఇంటి వద్దకే తీసుకొచ్చి అందజేయనున్నట్టు తెలిపారు.

వీటితో పాటు మలబార్ గ్రూప్ ఇతర సాంఘిక సంక్షేమం, వైద్య సంరక్షణ, విద్యార్థినులకు విద్య, పేదల ఇళ్ల నిర్మాణానికి పాక్షికంగా మద్దతు అందించడం వంటి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలలో సైతం చురుకుగా పాల్గొంటుందని చెప్పారు. మలబార్ గోల్డ్‌అండ్ డైమండ్స్‌తో సహా మలబార్ గ్రూపులోని వివిధ వ్యాపార విభాగాల నుండి వచ్చే లాభాలలో ఐదు శాతాన్ని సామాజిక సేవ, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయిస్తుందన్నారు. ఇలాంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటికే సంస్థ రూ.246 కోట్ల రూపాయలను మలబార్ గ్రూప్ ఖర్చు చేసిందని తెలిపారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**నవతెలంగాణ-కమలాపూర్**

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని కమ్యూనిటీ హాలులో రెడ్ క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో వద్దులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60ఏండ్లు పైబడిన వయో వద్దులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్‌క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి నెల క్యాంపు నిర్వహించి వద్దులకు బిపి. షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. 106 మంది వయోవద్దులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని మాజీ ఎంపిటిసి బాలసాని రమేష్ గౌడ్ ఏర్పాటు చేయగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జె. కిషన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్‌క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, అనిల్, జక్కోజు నరసింహ చారి, రాజు, నాయకులు: జనగాని శివ కష్ణ, పెరుమాళ్ళ పరుశరాములు, మార్గం భిక్షపతి , తదితరులు పాల్గొన్నారు.



## 'మాధురి'కి డాక్టరేట్ ప్రదానం

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**

హనుమకొండ జిల్లాకు చెందిన పందిరి మాధురి, హైదరాబాద్ హిమాయత్ నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో పందిరి మాధురి డాక్టరేట్ పొందారు. మంగళ వారం రిజిస్ట్రార్ రవీందర్, ప్రొఫెసర్ క్రిస్టోఫర్‌లు పందిరి మాధురికి డాక్టరేట్ ప్రదానం చేశారు.రసాయన శాస్త్ర విభాగంలో "సింథెసిస్ అండ్ కారక్టరైసేషన్ ఆఫ్ నావెల్ బెంజ్ఇమిడాజోల్స్ అండ్ క్వినాక్సాలిన్ మొయిటీస్ అండ్ దేర్ బయోలాజికల్ ఆక్టివిటీ" అంశంపై ప్రొఫెసర్ డా.బి. శ్రీనివాస్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు.వైస్ చాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటర్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డిలు పందిరి మాధురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్,ప్రొఫెసర్లు క్రిస్టోఫర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**నవతెలంగాణ-ఆత్మకూరు**

జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలైన సంఘటన ఆత్మకూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేష్‌రెడ్డి కథనం ప్రకారం.. మల్లంపల్లి మండలం మహ్మద్ గౌస్‌పల్లికి చెందిన గొట్టెముక్కుల అశోక్, అతని భార్య సుశీల ద్విచక్ర వాహనంపై వరంగల్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో నీరుకుళ్లకు చెందిన మానగాని రాకేష్ కారును అతివేగంగా నడుపుతూ బైక్‌ను వెనుక నుంచి ఢీ కొట్టాడు.దీంతో బైక్‌పై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సుశీల పరిస్థితి సీరియస్‌గా ఉందని ఎస్సై తెలిపారు. క్షతగాత్రులను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించామని, ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# ఓట్ల లెక్కింపులో నియమ నిబంధనలు పాటించాలి

### హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నవతెలంగాణ-సుబేదారి**

జూన్ 4వ తేదీన పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలని కౌంటింగ్ అధికారులకు, సిబ్బందికి హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, ఇతర సిబ్బందికి కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా ఈవీఎం ద్వారా కౌంటింగ్ సంబంధించిన నిర్వహణ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సంబంధించి జూన్ 4వ తేదీన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని కౌంటింగ్ కేంద్రాలలో కొనసాగే కౌంటింగ్ ప్రక్రియలో ఎక్కడ కూడా పొరపాటు లేకుండా చూసుకోవాలన్నారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. కౌంటింగ్ లో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సంబంధిత ఏఆర్వోలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, పరకాల, పశ్చిమ నియోజకవర్గాల ఏఆర్వోలు డాకె. నారాయణ, వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

# విత్తన వ్యాపారులు రైతులను మోసం చేయొద్దు

### పరకాల ఏసీపీ కిషోర్ కుమార్



**నవతెలంగాణ-పరకాల**

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని ఏసీపీ కిషోర్‌కుమార్ హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుండగా రైతులు పత్తి, మిర్చి విత్తనాలు, తదితర విత్తనాలను కొనుగోలు చేయడానికి వస్తారని, ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులనే విక్రయించాలని సూచించారు. విత్తనాలకు సంబంధించిన ఎమ్మార్పీ ధరతో పాటు ఒరిజినల్ బిల్లుల రసీదులు ఇవ్వాలన్నారు. ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే రైతులు వారిపై సమాచారం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు ప్రతి ఫర్టిలైజర్ విత్తన నిర్వాహకులు రైతులకు ఏ విత్తనాలు అమ్ముతారో వాటికి సంబంధించిన సీడ్స్‌ను ఖచ్చితంగా స్టాక్ రిజిస్టర్‌లో, నోటీస్ బోర్డ్‌లో చూపెట్టాలని, నోటీసు బోర్డులో ఉన్న మేరకే నిర్వాహకులు విత్తనాలను కంపెనీ నిర్ణయించిన ధరకే అమ్మాలని సూచించారు. రైతులను మోసం చేసేలా నకిలీ విత్తనాలను అమ్మినా, బ్లాక్ దందా చేసినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఏసీపీ హెచ్చరించారు.

**ఎల్కతుర్తి :** రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించి నష్ట పరిస్తే విక్రయదారులపై పీడీ యాక్టు తప్పదని ఎస్సై గోదరి రాజ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి మండల రాజకుమార్ అధ్యక్షతన ఎరువులు, ఫెర్టిలైజర్, పెస్టిసైడ్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ దామోదర్, ఏఈఓలు పంజాల రాజుగౌడ్, తిరుపతి, కళ్యాణి, రోజా, డీలర్లు, వ్యవసాయ శాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి

### ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చుక్కయ్య



**నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని ఎం.చుక్కయ్య ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం 2021నాటికి వ్యవసాయ ప్రణాళికను నిలిపివేసిందని, దాన్నికాంగ్రెస్ ప్రభుత్వం అత్యవసరంగా వ్యవసాయ విధానాన్ని రూపొందించి, ప్రణాళికను ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. రుణప్రణాళిక ప్రకటించి ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సూచించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముమ్మడి శ్రీకాంత్ అధ్యక్షతన జిల్లా ఏఐకెఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ జూన్ 6న ఏఐకేఎస్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆ సమావేశంలో జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సీజనల్ సమస్యలపై, ప్రభుత్వం ఎన్నికలలో ప్రకటించిన హామీల అమలుపై చర్చించుచున్నట్లు చుక్కయ్య తెలిపారు.ఈ సమావేశాన్ని హనుమకొండలోని సుందరయ్యభవన్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి పర్వతాలు పాల్గొన్నారు.

# గో సంరక్షక గూండాల దాడులను ఖండించాలి

### కేవీపీఎస్ హన్మకొండ జిల్లా కార్యదర్శి మంద సంపత్



**నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ**

గుజరాత్ రాష్ట్రంలో గో రక్షక దళాల ముసుగులో సామూహిక దాడులకు, హత్యలకు పాల్పడుతున్న గో గూండాల అరాచకాలను ఖండించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ అన్నారు. మంగళవారం కేవీపీఎస్ జిల్లా ముఖ్యనాయకుల సమావేశం రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రంలోని బస్కంద జిల్లాలో సంత నుండి రెండు గోవులను కొనుగోలు చేసి తన అవసర నిమిత్తం ట్రాలీలో తరలిస్తుండగా, గో రక్షక దళాల ముసుగులో కొందరు ఆకతాయిలు ఆ బండిని వెంబడించి సామూహికంగా మూకుమ్మడిగా దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడిలో కూలీ పని చేసుకునేని విపరీతంగా కొట్టడంతో అతడు అక్కడే ప్రాణాలు వదిలారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కేసుపై నిందితులపై పోలీసు శాఖ నామమాత్రపు కేసుగా నమోదు చేయడం తగదన్నారు. వెంటనే అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ కేసులో నిర్లక్ష్యం వహిస్తున్న పోలీసులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, ఉపాధ్యక్షులు దూడపాక రాజేందర్, ముడుసు నారాయణ, జిల్లా మాజీ అధ్యక్షులు జన్ను సాంబయ్య పాల్గొన్నారు.

## చెరువు మట్టితీత పనులను అడ్డుకున్నగ్రామస్తులు

### మాజీ ఎమ్మెల్యే చల్లాపై మండిపాట



**నవతెలంగాణ-నడికూడ**

మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మట్టి తీయడానికి వచ్చిన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వాహనాలను నడికూడ గ్రామస్తులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చల్లా ధర్మారెడ్డి ఐదేండ్లు గుట్టలను లూటీ చేశారని, చెరువులు కూడా ఖాళీ చేసేందుకు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి తీసేందుకు అనుమతులు ఉన్నా కూడా చెరువులో మట్టి తీసేదే లేదంటూ గ్రామస్తులు నినాదాలు చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

**నవతెలంగాణ-శాయంపేట**

వేరువేరు ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దురిశెట్టి కుమారస్వామి (35) కులవత్తితో పాటు కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో రోడ్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా కోతుల మంద మీదికి రావడంతో కుమారస్వామి ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో తలకి బలమైన గాయమై అక్కడి కక్కడే మరణించాడు. కుమారస్వామి తల్లి దుర్శెట్టి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బేతి బుచ్చిరెడ్డి (50) ఈ నెల 15న తన ద్విచక్ర వాహనంపై కొప్పుల గ్రామానికి వెళుతుండగా, మైలారం గ్రామం వద్ద రోడ్డుపై కుక్క అడ్డం రావడంతో ప్రమాద వశాత్తు వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో బుచ్చిరెడ్డికి బలమైన గాయాలు కాగా కోమాలోకి వెళ్లిపోయాడు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. బుచ్చిరెడ్డి భార్య బేతి. సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపారు.



## కాకతీయ సమగ్ర చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

**నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా**

రావుల సుదర్శన్ రచించిన కాకతీయ సమగ్ర చరిత్ర పుస్తకాన్ని వేయి స్తంభాల దేవాలయం ప్రధాన అర్చకుడు గంగు ఉపేందర్‌శర్మ మంగళవారం ఆవిష్కరించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించిన గంగు ఉపేందర్ శర్మ అనంతరం మాట్లాడారు.కాకతీయుల కళావైభవాన్ని వారు నిర్మించుకున్న ఆధ్యాత్మిక ఆలయాల గురించి నేటి తరానికి అందించాలనే సంకల్పంతో రావుల సుదర్శన్ ఈ విషయాలను సేకరించి పుస్తకరూపంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస చారి, మురళి, పులి రజినీకాంత్, గంత్రాతి రాజు, రవికుమార్, సంతోష్ పాల్గొన్నారు.



## బార్ పర్మిషన్‌ను వ్యతిరేకిస్తూ నిరసన

**నవతెలంగాణ-నయీంనగర్**

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 61డివిజన్‌లో గల సిద్ధార్థ నగర్ (వడ్డేపల్లి చెరువు కట్ట)లో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం పక్కన అక్రమంగా బార్‌కు ఎక్సైజ్ శాఖ పర్మిషన్ ఇచ్చిందని,ఈ పర్మిషన్‌ను వెంటనే రద్దు చేసి, బార్‌ను ఆ ప్రాంతం నుంచి ఎత్తేయాలని సిద్ధార్థ నగర్ కాలనీవాసులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం దగ్గర బార్ పర్మిషన్ ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. బార్ పర్మిషన్ ఇచ్చిన ఎక్సైజ్ సూపరిటిండెంట్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని,ఈ ఆలయం పవిత్రతను కాపాడాలని కోరారు. బార్ పర్మిషన్ రద్దు చేసి బార్‌ను ఎత్తేయకుంటే నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఘనంగా ఎన్టీఆర్ 101 జయంతి

**నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా**

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా టీడీపీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి ఎండీ రహీం ఆధ్వర్యంలో హన్మకొండలోని తన స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నాయకులు ఎండీ యాకూబ్, జయశంకర్, మనోహర్, సురేష్, వరంగల్ పార్లమెంట్ ఐటీడీపి అధ్యక్షులు మచ్చ లక్ష్మణ్, రాష్ట్ర వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సతీష్, శేషాద్రి, కిన్నెర సుధాకర్, బైరపాక ప్రభాకం పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

**నవతెలంగాణ-నడికూడ**

మండలకేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా అధ్యక్షుడు దారబోయిన ప్రణయ్‌దీప్ ముదిరాజును నడికుడ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తాళ్ల శ్యాంరాజ్ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఓబిసి జిల్లా నాయకులు బొమ్మ చంద్రమౌళి గౌడ్, కాంగ్రెస్ నాయకులు నారగాని కుమారస్వామి గౌడ్, తాళ్ల నవీన్, రావుల సురేష్, అట్టెం వెంకటేష్, నారగాని ఐలయ్య, టిఆర్ఎస్ నాయకులు చెన్నబోయిన రామ చందర్, రావుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలపై కోతుల దాడి

**నవతెలంగాణ-నడికూడ**

మండలంలోని రాయపర్తి గ్రామంలో కొన్ని రోజులుగా కోతుల బెడదతో గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్తున్న క్రమంలో కోతుల గుంపు వారిపై దాడి చేసింది. ఈ సంఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక గ్రామపంచాయతీ సమీపంలో ఉదయం ఉపాధి పనుల నిమిత్తం కూలీలు వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కోతుల గుంపు వారిపై దాడి చేశాయి. కోతుల దాడిలో వంగర మల్లయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కోతుల నివారణ చర్యలు చేపట్టి కోతుల బెడద నుండి గ్రామ ప్రజలను రక్షించాలని కోరారు.

## అంగరంగ వైభవంగా నగర సంకీర్తన

**నవతెలంగాణ-నడికూడ**

మండలంలోని కౌకొండ గ్రామంలో మంగళవారం హనుమాన్ మాలాధారణ స్వాములు ఉమామహేశ్వర ఆలయం నుండి బయలుదేరి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో తిరుగుతూ శ్రీరామ నామం జపిస్తూ, పాటలు పాడుతూ, భజనలు చేస్తూ హనుమాన్ నగర సంకీర్తన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు దౌల్తాబాజి చందర్‌రావు, అల్లె బాంబు రమేష్, లింగాల తిరుపతి, బాలస్వాములు అబ్బోజు హరికష్ణ చారి, ముక్కెర అభిరామ్, లింగాల స్వాతిప్రసన్న తదితరుఉలు పాల్గొన్నారు.



## నేడు చండీ హోమం

**నవతెలంగాణ-దామెర**

దామెర మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయాన్ని నిర్మించి 40ఏండ్లు కావస్తున్న సందర్భంగా దేవాలయంలో మహా చండీ హోమం నిర్వహించనున్నారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## విద్యార్థులకు ఆర్టీసీ ఎండీ గుడ్ న్యూస్

**నవతెలంగాణ-హసన్‌పర్తి**

టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పారు. వరంగల్‌లోని టీజీఎస్ ఆర్టీసీ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్, పేయింటర్ వంటి ట్రేడ్‌లలో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. వివిధ కోర్సులలో అడ్మిషన్ పొందగోరె విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ప్రత్యేక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై అవగాహన పొందాలి : కలెక్టర్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపు సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో శిక్షణ పొందాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ 4న 14-భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా నిర్వహించే 98-జనగామ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును, అదేవిధంగా 15-వరంగల్ (ఎస్సీ) పార్లమెంటు నియోజకవర్గంలో నిర్వహించే 99-స్టేషన్‌ఘన్పూర్, 100-పాలకుర్తి నియోజకవర్గంల ఓట్ల లెక్కింపును సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా చేపట్టేందుకు పూర్తిస్థాయిలో అవగాహన పొందాలన్నారు. కౌంటింగ్ రూమ్‌లో 17 టేబుల్స్ ఉంటాయని, కంట్రోల్ యూనిట్ నుండి బటన్ నొక్కి ఫలితాలు చెప్పేటప్పుడు ప్రజాప్రతినిధులందరికీ తెలియజేయాలని, బిగ్గరగా చెప్పాలని, ప్రతి ఒక్కటి నమోదు చేసుకుంటున్నందున అవగాహనతో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, కలెక్టర్ కార్యాలయ ఏవో రవీందర్, కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ ఏజెంట్స్, మైక్రో అబ్జర్వర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పద్మ అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం అందజేసే పద్మ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జిల్లా యువజన, క్రీడల అధికారి బి.వెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందినవారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో కళా రంగం, సామాజిక సేవ, ప్రజాసేవ, విజ్ఞాన శాస్త్రం, ఇంజనీరింగ్, వ్యాపారం, పరిశ్రమలు, వైద్యశాస్త్రం, సాహిత్యం, విద్య, క్రీడలు, తదితర రంగాలలో విశేష కృషి చేసిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తాము చేసిన కార్యక్రమాలను 8 పదాలకు మించకుండా వెబ్‌సైట్‌లో దరఖాస్తులు నింపాలని, అట్టి దరఖాస్తులను సంబంధిత ధృవపత్రాలతో మూడు సెట్లను కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని రూమ్ నంబర్ ఎస్-15 జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో జూన్ 3 లోపు అందజేయాలని ఆయన కోరారు.

## రుద్రమదేవి వృద్ధాశ్రమంలో ప్రవేశాలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

స్థానిక రుద్రమదేవి ఆధ్వర్యంలో జనగామ మండలం శామీర్‌పేట గ్రామంలో నిర్వహిస్తున్న వృద్ధుల ఆశ్రమంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆశ్రమ ఇన్చార్జి సుంకరి దేవేందర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసులో నిరుపేద పురుషులు, మహిళలు, ఒంటరి (కుటుంబ సభ్యులచే తాత్కాలికంగా విడిచిపెట్టబడిన) మహిళలు, పురుషులు ఆశ్రమంలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఇక్కడ ఆశ్రయం పొందే వృద్ధులకు 24 గంటలు వైద్య సేవలు, పౌష్టికాహారం, పూర్తిస్థాయిలో నర్సింగ్ సేవలు, యోగ నిర్వహణ, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు,పరిశుభ్రమైన బాత్రూంలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర సేవలు అందుతాయని, వివరాలకు 9032342511 ఫోన్ నంబర్‌లో కాని, నేరుగా కానీ సంప్రదించాలని ఆయన కోరారు.

## జిల్లాలో 76.34 శాతంగా పోలింగ్ నమోదు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జిల్లాలో 76.34 శాతంగా పోలింగ్ నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. సోమవారం జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 27 పోలింగ్ కేంద్రాలు ఉండగా జనగామ డివిజన్ పరిధిలో (76.48) శాతంగా పోలింగ్ నమోదు కాగా ఘనపూర్ (స్టేషన్) డివిజన్ పరిధిలో 76.10 శాతంగా పోలింగ్ నమోదైందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 23,419కు గాను 17,879 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వివరించారు.



## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-లింగాలగణపురం

మండలం నేలపోగుల గ్రామానికి చెందిన గైని సోమక్క, సముద్రాల గౌరమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ఆరెండు కుటుంబాలను పరామర్శించి రెండు క్వింటాల బియ్యాన్ని సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి, నేలపోగుల ఎంపీటీసీ డాక్టర్ గుగ్గిల్ల నర్సయ్య అందించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గైని ప్రవీణ్, మాజీ ఉపసర్పంచ్ ఆవుల ఎల్లమ్మ, మాజీ వార్డు సభ్యులు గుగ్గిళ్ళ యాకలక్ష్మీ, అబ్బ సాయిలు, కోశాధికారి బాకీ అశోక్, గుగ్గిళ్ళ ప్రభాకర్, గుగ్గిళ్ళ నాగరాజు, యూత్ నాయకులు నోముల రజనీకాంత్, సీనియర్ నాయకులు గుగ్గిళ్ళ కొమరయ్య, ఆకుల సత్తయ్య, దేని అంజయ్య, గైని శంకర్, సముద్రాల మల్లయ్య, సముద్రాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

మండలంలోని హరిపిరాల గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ గ్రామ ఉపసర్పంచ్ వల్లపు నారాయణ భార్య వల్లపు కమలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కమలమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చల్లమ్మ మరణం చాలా బాధాకరమని ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని దేవుని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదగాని సోమన్న గౌడ్, మాజీ పీసీసీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంచు సంతోష్, రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ కమిషన్ డైరెక్టర్ లింగాల వెంకటనారాయణ గౌడ్, మాజీ మండలాధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, కిషన్ యాదవ్, ఎర్ర మల్లారెడ్డి పాల్గొన్నారు.



## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గార్ల

మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన నేతగాని సుధీర్ (29) అనే యువకుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మృతి చెందిన స్నేహితుడు సుధీర్ కుటుంబానికి గోపాలపురం గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు 18,140 రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుడు సుధీర్ కుటుంబానికి అందించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. సుధీర్ మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సుధీర్ కుటుంబానికి ఎల్ల వేళల అండగా ఉంటామని తెలిపారు.



# కమ్యూనిస్టులు బలపడాలి

- సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కార్మిక, కర్షక వర్గాలకు న్యాయం జరగాలంటే కమ్యూనిస్టులు బలపడాలని, ఈనెల 31, జూన్ 1న జరిగే సీపీఎం రాజకీయ శిక్షణ జిల్లా తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని క్రిష్ణాజిగూడెం గ్రామంలో గ్రామశాఖ అధ్యక్షులు గద్ద కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను స్టేషన్‌ఘనపూర్ నియోజక వర్గ కేంద్రంలో జరుగుతాయని, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దేశంలో కార్మిక, కర్షక వర్గాలకు న్యాయం జరగాలంటే కమ్యూనిస్టులు బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సమర శీల పోరాటాలకు ఊతమిచ్చే విధంగా జరిగే తరగతుల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని అన్నారు.సీపీఎం పార్టీతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడిన ఏకైక పార్టీ ఎర్రజెండా సీపీఎం అన్నారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం చర్చ జరుగుతుందని, కార్యకర్తలకు చైతన్యం కలిగించే అవకాశం ఈ తరగతుల్లో ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముడిక భీమయ్య, సాదం రాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



నవతెలంగాణ-జనగామ

అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను గడువులోగా పూర్తిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని రఘునాథపల్లి మండలం గబ్బేట, ఖిలాషాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ఎంపీపీఎస్‌లు, కేజీబీవీ పాఠశాల, ఘనపూర్(స్టేషన్) మండలంలోని నమిలిగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలను సందర్శించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పర్యవేక్షించారు. పాఠశాలల పెయింటింగ్, హ్యాండ్ వాష్ ప్లాట్ ఫాం పనులను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర మౌలిక వసతుల పనుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, పాఠశాలల్లో కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీలో ఆయన వెంట డీఈఓ రాము, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కక్కుర్తి కడియంను ప్రజలు ఛీ...కొడుతున్నారు..

- ఎమ్మెల్యే ఉపఎన్నిక కోసం ప్రజలు ఎదురుచూపు
- నైతికతని మాట్లాడే కడియం రాజీనామా చెయ్
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

72 ఏళ్ల వయసున్న కడియం శ్రీహరి రాజకీయ కక్కుర్తి పట్ల, తెలంగాణ ప్రజలు ఛీ కొడుతున్నారని, నైతికతని మాట్లాడుతున్న కడియంకు సిగ్గేమైనా ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కాంగ్రెస్ పక్షాన పోటీకి రా... నియోజకవర్గ ప్రజలందరూ మరొక్కసారి తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, ఓట్లేసి గెలిపిస్తే మోసం చేసిన లక్ష మందికి జవాబుదారీగా కడియంకు బాధ్యత ఉన్నదని, రాజకీయ విలువల గూర్చి మాట్లాడే కడియం నీచుడని, ప్రజలే అంటున్నారని, ఎమ్మెల్యేగా అనర్హుడవుతాడని, తన పదవికి రాజీనామాకై నియోజకవర్గ ప్రజలు మరో ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం నియోజక వర్గ కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో రూ. 37.5 కోట్లతో మంజూరైన వంద పడకల ఆసుపత్రి, చాగల్, శివునిపల్లి, స్టేషన్ ఘనపూర్ కలిపి మున్సిపాలిటీ వంటి ప్రస్తావనే లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన పనులు సాగడం లేదని, సైనిక, హైద్రాబాద్ పబ్లిక్ స్కూలు మంజూరిపై జాప్యం ఎందుకని అన్నారు. కడియం కాంగ్రెస్‌లో చేరిన సంగతి ఏంటని, ఎజెండా ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. టిడిపిలో పదేండ్లు మంత్రిగా మార్కెట్, సాంఘిక సంక్షేమ, విద్యాశాఖ, ఇరిగేషన్ శాఖల్లో, ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మంత్రిగా ఉండి మరలా బీఆర్ఎస్‌లో ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్సీ, ఉపముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యేకు తోడుగా కూతురుకు ఎంపీ టికెట్టు, అభివృద్ధి కోసం వెళ్లానన్న కడియం 20 ఏండ్లుగా గాడిద పండ్లు తోమాడాని ఎద్దేవా చేశారు. స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం ప్రజలు చైతన్యవంతులని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎంరేవంత్ రెడ్డి బీఆర్ఎస్ తప్పులను వెతుకుతూ, అదే సాకుతో పబ్బం గడుపుతున్నారని, ప్రజలంతా గమనిస్తున్నారని కర్రు కాల్చి వాతలు పెడతారని హెచ్చరించారు. మేడిగడ్డ, మిషన్ భగీరథ పనులు నిలిచాయని, నియోజకవర్గంలో దాదాపు 133 కోట్ల ఇరిగేషన్ పనులకు, గత 6నెలలుగా వాటిపై సమీక్ష లేక నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. శీఘ్రతరంగా ఆగిన ఇరిగేషన్ పనులను పూర్తిచేసి, వాన కాలంలోనే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, లాఠీఛార్జీ చేస్తున్నారని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానని తీన్మార్‌మల్లన్న అన్నారని,ఆమాటలు అభ్యంతరకరం అన్నారు. కడియం శ్రీహరి అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు పోతే, తన ఏజెండాను ప్రకటించాలని అన్నారు. గత సంక్షేమ ఫలాలన్నిటికీ గుండు సున్నా పెట్టి, అధికారమే లక్ష్యంగా చేసుకుని... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను విస్మరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కహామీ నెరవేర్చలేదని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి, ఆరు గ్యారెంటీలలో ఉచిత బస్సు మినహా, మిగిలిన వాటిని చేయలేదని, మొండి వైఖరితో రేవంత్ ఇలాగే పాలన సాగిస్తే కర్రు కాల్చి వాతపెడతారని అన్నారు.

పార్టీ సభ్యత్వం కాలపరిమితి ముగిసినందున, కొత్తగా సభ్యత్వాలు పార్టీ నిర్దేశంతో అవుతాయని, పార్టీ గ్రామ, మండల కమిటీలలో ప్రక్షాళన ఉంటుందని, ఇటీవల జరిగిన ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు గొప్పగా పని చేశారన్నారు. కష్టించి పనిచేసిన ప్రతీ ఒక్కరికీ పార్టీలో,ఎన్నికలు ఎప్పుడొచ్చినా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో తగు ప్రాధాన్యత ఉంటుందని, ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రశ్నించే గొంతుకగా ప్రజాసమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల కుమార్, అక్కనపల్లి బాలరాజు, తాటికొండ సురేష్, ఆగారెడ్డి, నర్సింహ రెడ్డి, చందర్ రెడ్డి, మండలాధ్యక్షులు మాచర్ల గణేష్, సమ్మిరెడ్డి, రాజన్ బాబు, మునిగెల రాజు, ఏసుబాబు, మాతంగి దేవయ్య, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అన్నెపు ఐలయ్య, కుంభం కుమారస్వామి, చిరంజీవి, గుండె మల్లేష్, రంజిత్, ప్రసాద్, శాగ వెంకటేశ్వర్లు, రమేష్ నాయక్, అశోక్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలి

- ఏంకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు

నవతెలంగాణ-గార్ల

జూన్ నెలలోగా రైతుల రుణాలు ఏకకాలంలో మాఫీ చేసి కొత్తరుణాలు మంజూరు చేయాలని ఏంకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దారు రవీందర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాలను ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు 50 శాతం సబ్సిడీ పై అందించాలని డిమాండ్ చేశారు. వడగళ్ళ వర్షంతో పంటలు నష్టపోయిన మామిడి రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వీరభద్రం, వి.సక్రు, యం.మాన్య, మంగయ్య, ప్రసాద్, రాజ్ కుమార్, మత్రు తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలల నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-గార్ల

మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంలో ఎంపికైన పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనులను త్వరతగతిన పూర్తి చేయాలని సిఇఓ నర్మదా అన్నారు. మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద ఎంపికైన పుల్లూరు,సూర్య తండా, మర్రి గూడెం,పూసల తండ, తీర్లాపురం, గార్లలోని ప్రభుత్వ పాఠశాలలను డిపివో హరిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభంలోగా మరుగుదొడ్లకు మరమ్మత్తులు, మంచినీటి సౌకర్యాలు, కిటికీలు, తలుపులు, ఎలక్ట్రిసిటీ తదితర మౌలిక సదుపాయాల మరమ్మత్తులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయించేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో మంగమ్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు కిషన్ నాయక్, కిషోర్, వెంకటేశ్వర్లు, అయా పాఠశాల హెచ్‌యంలు పాల్గొన్నారు.

## వడదెబ్బతో కూలీ మృతి

నవతెలంగాణ-దంతాలపల్లి

వడదెబ్బకు గురై ఉపాధి హామీ కూలి మృతి చెందిన సంఘటన మండలంలోని రామవరం గ్రామంలో చోటు చేసుకుంది. మంగళవారం గంగినేని లింగమ్మ (60 ) ఉపాధి హామీ కూలి పనికి వెళ్లి పని ప్రదేశం నుంచి వస్తున్న క్రమంలో అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు, కుటుంబ సభ్యులు, ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# పార్లమెంట్ కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించు పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు, పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలని, గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలన్నారు.ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాల్‌లో నిర్దేశిత రౌండ్ల వారీగా కౌంటింగ్‌ను కట్టుదిట్టంగా పూర్తి చేయాలని, ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుల్‌ల కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అనంతరం ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, హై స్పీడ్‌తో కూడిన ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు కౌంటింగ్ హాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని వెళ్లడానికి వీల్లేదని, ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతి రౌండ్ ఫలితాలను ప్రకటించేందుకు ఒక జిల్లా సీనియర్ అధికారిని మీడియా సెంటర్‌లో ఇంచార్జీగా నియమించాలన్నారు.కౌంటింగ్ కేంద్రాల్లో సదుపాయాలను పరిశీలించి, కౌంటింగ్ నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు ధృవీకరణ పత్రం సమర్పించాలని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాఎన్నికల అధికారులకు, రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలన్నారు. ఈ వీడియో సమావేశం అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌మాట్లాడుతూ కౌంటింగ్ సక్రమంగా నిర్వహించేందుకు పక్కాఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన మేరకు అధికారులను, సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ డీఎస్. వెంకన్న, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

- టీడీపీ మండలాధ్యక్షుడు బైన బిక్షపతి



నవతెలంగాణ-పెద్దవంగర

టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని టీడీపీ మండల అధ్యక్షుడు బైన బిక్షపతి అన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలిపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం యాకయ్య, మడిపెద్ది ఐలయ్య, పాశం బుచ్చిరాములు, సోమ వీరన్న, తాడిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-బయ్యారం



మండలంలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ చొక్లతండ గ్రామ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్యక్షులు, హమాలీ యూనియన్ అధ్యక్షులు బాదావత్ శివ తండ్రి బాదావత్ ఈర్య (68) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఆంగోత్ శ్రీకాంత్ నాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జర్పుల శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షులు మందనపు వెంకన్న, బానోత్ నెహ్రూ, బానోత్ సతిష్, ఇస్లావత్ విరన్న, చంద్రశేఖర్, అజ్మీరా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాష్ క్షేమంగానే ఉన్నాడు...

- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**నవతెలంగాణ-బయ్యారం**

ప్రకాష్ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిఐ రవికుమార్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మున్సిఫ్ ప్రకాష్ అనే వ్యక్తి గురించి కంబోడియ దేశంలోని ఎంబసీ వారితో మాట్లాడి అతడు క్షేమంగా ఉన్నాడని సమాచారం తెలుసుకుని, వారి బంధువులకు సమాచారం అందించారు. ఇండియన్ ఎంబసీలో పనిచేస్తున్న ఆందోజన్ అనే ఆఫీసర్‌తో మాట్లాడి అతడు ఉన్నటు వంటి ప్రాంతాన్ని తెలుసుకొని, మున్సిఫ్ ప్రకాష్ అనే వ్యక్తితో కూడా ఫోన్‌లో మాట్లాడడం జరిగిందని, అతను ఇండియన్ ఎంబసీ అధికారుల యొక్క ఆధీనంలో ఉన్నాడని, అతను ప్రస్తుతం క్షేమంగా ఉన్నాడని, అతనిపై పెట్టిన కేసుల విషయం తేలిన తర్వాత అతన్ని ఇండియాకు పంపిస్తారని ప్రకాష్ తెలియజేసినట్లు పోలీసులు తెలిపారు.

# పని చేయని చేతిపంపు - కాలనీవాసుల ఇబ్బందులు

**నవతెలంగాణ-బయ్యారం**



మండల కేంద్రంలోని శివాలయం బజారులో 10 రోజుల క్రితం బోరింగ్ చైన్ తెగిపోవడం వల్ల బోరింగు పని చేయడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రామ పంచాయతీ ద్వారా అందే పంపు నీరు కూడా సరిగ్గా రావడం లేదని, వచ్చినా మూడు, నాలుగు బిందెల కంటే ఎక్కువ రావడం లేదని పేర్కొంటున్నారు. బోరింగ్ చెడిపోవడం వల్ల 8 కుటుంబాలు ఈ బోరింగ్ మీద ఆధార పడి ఉన్నాయని, బోరింగ్ సమస్య వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బోరు రిపేర్ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లేని యెడల గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



# మానుకోట రాళ్ళ ప్రతిఘటన భావితరాలకు స్ఫూర్తిదాయకం

- తెలంగాణ ఉద్యమ నాయకులు శంతన్ రామరాజు

**నవతెలంగాణ-మహబూబాబాద్**

మానుకోట రాళ్ల ప్రతిఘటన భావితరాలకు స్ఫూర్తిదాయకం అని తెలంగాణ ఉద్యమ నాయకులు శంతన్‌రామరాజు అన్నారు. మానుకోటలో ఘటన జరిగి పద్నాలుగేండ్లు అయిన సందర్భంగా మానుకోట రాళ్లకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంతన్‌రామరాజు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన నాటి ఘటన ప్రపంచ ఉద్యమాల చరిత్రలో మైలురాయి వంటిదన్నారు. ఓదార్పు యాత్ర ముసుగులో తెలంగాణ తల్లి గుండెల మీద నడవాలనుకున్న జగన్మోహన్ రెడ్డికి మానుకోట రాళ్లు గుణపాఠం నేర్పాయన్నారు.కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో గత పదేళ్లుగా ఉద్యమకారులు, ప్రజలు హిట్లర్ పాలనను చూసారన్నారు. ఆరు గ్యారంటీలతో ఇంటింటా సౌభాగ్యాన్ని నింపిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు. ప్రతి ఉద్యమకారునికి 250గజాల ఇంటి జాగాను ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, నాటి కాల్పుల్లో గాయపడ్డ గుగులోత్ రాములు నాయక్, పింగ్రాల రాందాస్, గుంజే హనుమంతు పాల్గొన్నారు.



# విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

**నవతెలంగాణ-దంతాలపల్లి**

రైతులు విత్తన కొనుగోలు సమయంలో పాటించవలసిన జాగ్రత్తలపై సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని పెద్ద ముప్పారం గ్రామంలోని రైతు వేదిక ఆవరణలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పచ్చి రొట్టె విత్తనాల పంపిణీ, వేసవి దుక్కి ప్రయోజనాలు, అధిక సాంద్రతలో పంటల భీమా, ఇతర పథకాల గురించి వివరించారు. రైతులందరూ ఒకే రకానికి ఎక్కువ డిమాండ్ చేయకుండా గత సంవత్సరం గ్రామాలలో మంచిగా దిగుబడి వచ్చిన రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఒక రకానికి పరిమితం అయితే వాతావరణం అనుకూలించకపోతే సరైన దిగుబడులు రావని, కాబట్టి మూడు నాలుగు రకాలను ఎంచుకున్నట్లయితే దిగుబడి పెద్దగా తగ్గదని తెలిపారు. ఒకే రకానికి డిమాండ్ ఎక్కువైనట్లయితే డీలర్లు బ్లాక్ చేసి ఎక్కువ ధరకు అమ్మే అవకాశం ఉందని అలాంటివి ఉన్నట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రైతులు సరైన యజమాన్య పద్ధతులు పాటించినట్లయితే పంట రకంతో సంబంధం లేకుండా అధిక దిగుబడులు సాధించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కొండ మధు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ నుండి చైతన్య సాయి, రైతులు పాల్గొన్నారు.



# విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

- వ్యవసాయ విస్తరణ అధికారి మురళి

**నవతెలంగాణ-ఇనుగుర్తి**

రైతులు విత్తన ఎంపిక సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అప్పుడే పంట దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ విస్తరణ అధికారి మురళి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని లాలు తండాలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి రైతులతో సమావేశమై పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో కూడా బయట వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదని తెలిపారు. బయట వ్యక్తులుఎవరైనా విత్తనాలు అమ్మినచో అలాంటి వారి సమాచారం వ్యవసాయ, పోలీస్ అధికారులకు అందించాలని తెలిపారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా పొందాలని, ఆ రశీదు పైన రైతు పేరు, గ్రామం, విత్తనం పేరు, లాట్ నెంబర్ కొనుగోలు చేసిన ప్యాకెట్‌ల సంఖ్య రైతు సంతకం డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తన ప్యాకెట్ పైన ఉన్న వివరాలు చూసి కొనుగోలు చేసుకోవాలని రైతులకు సూచించారు.

# జానీ మృత దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మురళి నాయక్

**నవతెలంగాణ-కేసముద్రం రూరల్**

మండల కేంద్రంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నేత షేక్ జానీ మృతదేహానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ పూలవాల వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వరరావు, తరాల వీరేష్,అయుబ్‌ఖాన్, రఫీ, నుజ్జు, తాజుద్దీన్, మండల, గ్రామ, యూత్ నాయకులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

**నవతెలంగాణ-మహబూబాబాద్**




జూలై 1 నుండి అమలయ్యే నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. జులై ఒకటి నుంచి ప్రభుత్వ అమలు చేస్తున్న నూతన చట్టాలపై మంగళవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ కానిస్టేబుల్ నుండి ఉన్నత అధికారుల వరకు విడతలవారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నూతన చట్టాలపై పోలీసు సిబ్బంది సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని సూచించారు. దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యలలో భాగంగా కొత్తగా రూపొందించిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినీయం-2023 ఈమూడు చట్టాలు రానున్న జూలై 1, 2024 నుండి అమలులోకి రానున్నాయి. నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి పరిజ్ఞానం ఉండాలన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందన్నారు. నూతన సెక్షన్ల ప్రకారం మాత్రమే వివిధ రకాల కేసులను నమోదు చేయాల్సి ఉంటుందని సూచించారు.ఈమూడు కొత్త చట్టాలు నేరస్థులకు శిక్ష వేయడం పాటు బాధితులకు న్యాయం అందించడంపైన ఎక్కువ దృష్టి పెడతాయన్నారు.క్రిమినల్ చట్టాలు మారుతున్న కాలానికనుగుణంగా నవీకరించబడ్డాయని అన్నారు. శిక్షణ గంద్రతి మోహన్ డిఎస్పీ ఫంక్షన్ వర్టీకల్స్ నేతృత్వంలో సీఐ డిసిఆర్ బి.సత్యనారాయణ, ఉపేందర్ సీఐ డోర్నకల్, ఎస్ఐ రమాదేవి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, శిక్షకులు చేతన్ పండరే, టౌన్ డిఎస్పీ తిరుపతి రావు, సీఐ దేవేందర్ పాల్గొన్నారు.

# వానాకాలం పంటలపై రైతు సదస్సు

- మండల వ్యవసాయ విస్తరణ అధికారులు

**నవతెలంగాణ-నెల్లికుదురు**



వానాకాలం వంటలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నెల్లికుదురు మండల వ్యవసాయ విస్తరణ అధికారులు చిన్నముప్పారం క్లస్టర్ ఏఈఓ ముజాహిద్, చిన్ననాగారం క్లస్టర్ ఏఈఓ సుమన్, మునిగలవీడు క్లస్టర్ ఏఈఓ కల్యాణి,ఆలేరు క్లస్టర్ ఏఈఓ శిరీష, యెర్రబెల్లిగూడెం క్లస్టర్ ఏఈఓ చందనలు తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి నేలకుర్తి రవీందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయా క్లస్టర్ గ్రామాలలో ఉన్న రైతులకు ముందస్తు ప్రణాళికలు - కొనుగోలు చేసిన విత్తనాలు పై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వానాకాలం సీజనులో పత్తి పంట రైతులు సాధారణ పద్ధతిలో కాకుండా నూతన పంట విధానంతో వెళ్లినట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. పత్తిలో స్వల్ప కాలపరిమితి పత్తి వేయడం ద్వారా గులాబీ పురుగు ఎదుర్కోవడం, అధిక దిగుబడి సాధించి, తదుపరి నవంబర్ చివర నాటికి యాసంగీ రెండో పంటకు వెళ్ళవచ్చు అని రైతులకు తెలిపారు. ఈ అధిక సాంద్రత విధానంలో సాలుకి సాలుకి మధ్య దూరం రెండున్నర అడుగులు (2ఫీట్ల 6ఇంచులు), మొక్కకి మొక్కకి మధ్య దూరం అర ఫీట్(6ఇంచ్లు) దూరం పాటించాలన్నారు. సాధారణ పద్ధతిలో ఏకరానికి 6 వేల నుండి 8 వేల మొక్కలు వస్తే ఈ పద్ధతిలో 18 నుండి 20 వేల మొక్కలు వేసుకోవడం జరుగుతుందని అన్నారు. మొక్కలు ఎక్కువగా పెరగకుండా పరిస్థితిని బట్టి రెడు సార్లు 45 రోజులకు ఒకసారి, 65 రోజులకు ఒకసారి మెపిక్వాట్ క్లోరైడ్(ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్) మందును పిచికారి చేసుకోవాలి, దీనిద్వారా మొక్క ఎక్కువగా పెరగకుండా పూత పిందె ఎక్కువ వస్తుందని, ఈ మందును వేరే పురుగుల మందులో కలిపి కూడా కొట్టవచ్చని రైతులకు సూచించారు. పంట 85వ రోజు దశలో తల, కొసలు తుంచడం ద్వారా మొక్క ఎత్తు పెరగకుండా ఆ బలాన్ని పూత పిందే గ్రహించి ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎర్ర నేలలు, తక్కువ బలం కల నేలలు ఈ రకమైన పంటకు ఎక్కువ అనుకూలం, అదే గనుక మంచి సేంద్రీయ నల్ల రేగడి నేలల్లో మొక్క శాఖీయ పెరుగుదల ఎక్కువగా దిగుబడి తక్కువ ఉండి ఈ రకమైన పంట విధానానికి అనుకూలం కాదని పంట పెరుగుదలను నియంత్రించడం వలన, పత్తి మొత్తం ఒకేసారి కాసి, ఒకటి రెండు పిక్కింగులలోనే మొత్తం పత్తి వస్తుందని, సాధారణ పద్ధతిలో కంటే 30 నుండి 50 శాతం అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో నూజివీడు వారి అర్పిత, విన్నర్, సిరి, రాసి కంపనీ వారి ఆర్‌సీహెచ్-929, స్విఫ్ట్‌లు అందుబాటులో కలవు వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. లేబుల్ లేని, లూజ్ విత్తనాలు కొనకూడదు, లైసెన్స్ పొందినటువంటి డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు లాట్ నెంబరు, బ్యాచ్ నంబరు ఎక్స్పైరీ డేటు, ఎమ్మార్పీ రేటు అన్ని చూసుకోవాలి, విత్తనాలు కొన్న తర్వాత తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి, మనం కొనుగోలు చేసినటువంటి విత్తనాన్ని రసీదు మీద రాసిందా లేదా అనేది తప్పనిసరిగా చూసుకోవాలి, ఏ పంట విత్తనమైన సరే పంట కోత అయిపోయే వరకు రసీదును జాగ్రత్తగా ఉంచుకోవాలని అది మీ బాధ్యత అని రైతులకు తెలిపారు.

# నెలసరి సమస్యలపై అవగాహన పెంచుకోవాలి

- డిప్యూటీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ అంబరీష

**నవతెలంగాణ-మహబూబాబాద్**



మహిళలు నెలసరి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అంబరీష తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఓ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అంబరీష ఆధ్వర్యంలో అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవంపె 15 నుండి 49 సంవత్సరాలలోపు స్త్రీలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.ప్రతి సంవత్సరం మే 28 న రుతుస్రావ ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, రుతుక్రమ ఉత్పత్తుల యొక్క సముచిత వినియోగం, అపోహలకు, ఆరోగ్య సమస్యలకు దారితీసే పరిస్థితుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. సరైన రుతుస్రావ పరిశుభ్రత జ్ఞానం అందుబాటులో లేకపోవడం వల్ల, భారతదేశంలో చాలామంది వారి రుతుక్రమ సమయంలో సవాళ్లను ఎదురుకుంటున్నారని, ఇది ఆరోగ్య ప్రమాదాలకు దారి తీస్తుందని తెలిపారు. రుతుక్రమ సమయంలో సరైన పోషక ఆహారం తీసుకోవడమే కాకుండా సరైన విశ్రాంతి తీసుకోవడం కూడా ఎంతో ముఖ్యమని, కొంత మంది స్త్రీలలో రుతుక్రమ సమయంలో తీవ్రమైన కానీ, స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురైన, 5 రోజులకు మించి రుతుస్రావం జరిగిన దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో గాని, స్త్రీ వైద్య నిపుణులను గాని సంప్రదించాలని, కౌమార దశలోని బాలికలకు పాఠశాలలోని ఉపాధ్యాయునిలు రుతుక్రమ పరిశుభ్రతపైన అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల వారు తయారు చేసే సానిటరీ ప్యాడ్స్‌ని కూడా ఉపయోగించు కోవచ్చన్నారు.

# ఆర్టీఏ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

- ఫిర్యాదు మేరకే తనిఖీలు - పోలీసుల అదుపులో ఆరుగురు ఏజెంట్లు
- ఏజెంట్లు, డ్రైవర్, సిబ్బంది వద్ద నగదు స్వాధీనం

**నవతెలంగాణ-మహబూబాబాద్**



మహబూబాబాద్ జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ డైరెక్టర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. మంగళవారం వరంగల్ నుంచి వచ్చిన ఆరుగురు ఏసీబీ అధికారుల బృందం ఆకస్మికంగా ఆర్టీఏ కార్యాలయంను చుట్టు ముట్టి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు సోదాలు తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సాంబయ్య విలేకరులతో మాట్లాడారు. ఆర్టిఏ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని, ఏజెంట్లు, సిబ్బంది కుమ్మక్కై అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తనకు ఫిర్యాదు వచ్చిందని, ఆ మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ కార్యాలయంలో తాము వచ్చిన సమయంలో ఆరుగురు ఏజెంట్లు లోపలికి వచ్చారని వారి వద్ద దరఖాస్తులు, ఫిట్నెస్, లెర్నింగ్ సర్టిఫికెట్ దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ఆర్టిఏ కార్యాలయంలో ఏజెంట్ల వ్యవస్థ లేదని మధ్య దళాలుగా మారిన కొద్దిమంది అధికంగా డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఆరుగురు ఏజెంట్లుగా ఉన్న వ్యక్తులను తమ ఆధీనంలోకి తీసుకొని విచారించగా వారి వద్ద 45 వేల రూపాయలు 100 దొరికినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్టిఏ కౌంటర్‌లోని క్లర్కులు, వాహన యజమానుల నుండి డీడీల రూపంలోనే తీసుకోవాలని, తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న డబ్బులకు ప్రభుత్వ రిజిస్టర్లో నమోదు చేయవలసి ఉంటుందని తెలిపారు. అయితే ఆర్టిఏ క్లర్కు వద్ద నిబంధనకు విరుద్ధంగా అధికంగా క్యాష్ ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే డిటిఓ గౌస్ పాషా వ్యక్తిగత వాహన డ్రైవర్ సుబ్బారావు వద్ద 16,500తో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్నెస్‌లకు సంబంధించిన దరఖాస్తులు కొన్ని కాగితాలు వాహన తాళం చేతులు దొరికాయని వాటిపై విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానుకోట ఆర్టిఏ కార్యాలయం అధికారులు సిబ్బంది స్థానికంగా ప్రభుత్వ నిబంధన ప్రకారం నడుచుకోవడం లేదని పూర్తి విచారణ కొనసాగించి తదుపరి మిగిలిన వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



# ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- సీపీఎం మండల నిర్మాణ బాధ్యులు గునిగంటి రాజన్న

**నవతెలంగాణ-కేసముద్రం రూరల్**

ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని సీపీఎం పార్టీ మండల నిర్మాణ బాధ్యులు గునిగంటి రాజన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో సీపీఎం పార్టీ మండల కమిటీ సమావేశం మొడెం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మోడీ ప్రభుత్వ పదేళ్ల పాలనలో పెట్రోల్, డీజిల్, జీఎస్టీ పేరుతో నిత్యవసర ధరలు విపరీతంగా పెంచి పేద, మధ్యతరగతి ప్రజానీకంపై ధరలు విపరీతంగా పెంచి ధనికులకు,పెట్టుబడుదారులకు, కార్పొరేట్లకు చౌకగా ఉండే విధంగా నిబంధనలు చేసిన ఘనత బీజేపీ మోడీ ప్రభుత్వానిదే అని అన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటమి భయంతో ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాలించే నాయకులు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు, చాగంటి కిషన్, వేల్పుగొండ సావిత్ర, జాటోత్ వెంకన్న, కావటి నరసయ్య, కోడిషాల వెంకన్న, సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

**నవతెలంగాణ-మహబూబాబాద్**

మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ కౌంటింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో జూన్ 4న నిర్వహించనున్న కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో నిర్వహించనున్న కౌంటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డేవిడ్, ఏడి గ్రౌండ్ వాటర్ సురేష్, సిపిఓ సుబ్బారావు, డిహెచ్ఎస్ఓ మరియన్న, ఏవో వెంకట రమణ, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ పవన్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భద్రకాళి, రమణి, తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- అటవీశాఖ డివిజనల్ అధికారి వి.చంద్రశేఖర్ రావు

**నవతెలంగాణ-గూడూరు**






వేసవికాలంలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జంతువులు సంచరించే ప్రాంతాలను గుర్తించి తాగునీటి కొరత లేకుండా గూడూరు డివిజనల్ అటవీశాఖ పరిధిలోని గూడూరు, కొత్తగూడ, గంగారం రేంజ్ పరిధిలో అటవీ శాఖ సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో మండుతున్న ఎండాకాలంలో అడవి జంతువుల సంరక్షణ కోసం తగినన్ని ఏర్పాట్లు చేశారు. గూడూరు అటవీశాఖ డివిజన్ కార్యాలయం పరిధిలో కొత్తగూడ, గంగారం, గూడూరు అటవీ శాఖ కార్యాలయాల పరిధిలో 99 హెక్టార్లలో రెండున్నర లక్షల ఎకరాల అటవీ భూమి ఉంది. గత ప్రభుత్వం అటవీ భూముల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకురాగా అటవీశాఖ అధికారులు ప్రతిష్టమైన ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గూడూరు డివిజనల్ కార్యాలయం పరిధిలో వన్యప్రాణుల సంరక్షణ కోసం నిధులు కేటాయించి గూడూరు రేంజ్ పరిధిలోని అపరాజుపల్లి, సెక్షన్ పరిధిలో జగనాయకులగూడెం, గూడూరు సెక్షన్ పరిధిలో బ్రాహ్మణపల్లి, గూడూరు సెక్షన్ ఉట్ల బీట్ నెలవంచ, భూపతిపేట సెక్షన్ చిన్నఎల్లాపూర్, కొత్తగూడెం బత్తులపల్లి సెక్షన్ లోనే దొరవారివేంపల్లిలో, కార్లయి సెక్షన్ పరిధిలోని, కొత్తగూడ రేంజ్ పరిధిలోని పునుగొండ్ల సెక్షన్ పరిధిలోని కామగండి, సోలార్ పంపులు, నీటి కుంటలు గడ్డి పెరిగే విధంగా ఏర్పాటు చేశారు. నీరు వృథాగా వెళ్లేచోట చెక్ డ్యామ్‌లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గూడూరు అటవీశాఖ డివిజనల్ పరిధిలో మూడు రేంజిల పరిధిలో 33 ప్రాంతాలలో సాసర్ ఫీట్లు, సిమెంటు కుండీలలో నీటి నిల్వను ఉంచే విధంగా వన్య ప్రాణులకు సౌకర్యంగా ఏర్పాట్లు చేశారు.అభయారణ్యంలో గంగారం రేంజ్ పరిధిలో మదేగూడెం సెక్షన్ పరిధిలోని మడెగుడెం సౌత్ బీటులో జంతువుల సంరక్షణ కోసం భారీగా పార్కులేషన్ ట్యాంక్ (నీటి నిల్వ కుంట) సోలార్ సిస్టం, సోలార్ బోర్, క్యాంపింగ్ సైట్‌ను సిబ్బంది ఉండే విధంగా ఏర్పాటు చేశారు. గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో దొరవారి తిమ్మాపూర్ పులిమడుగు వద్ద క్యాంపింగ్ సైటును ఏర్పాటు చేశారు. అటవీ శాఖ సిబ్బంది నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. అటవీ జంతువుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పర్యవేక్షణ చేస్తున్నారు.

## సీసీ కెమెరాల నిఘా...

అభయారణ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో రాత్రి పగలు వేళల్లో కూడా జంతువుల కదలికలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.జంతువులు దాహాన్ని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి కుంటల వద్దకు వస్తు దాహం తీర్చుకుంటున్నాయి. అడవిలో ఎక్కువగా ఎలుగుబంట్లు, నక్కలు, అడవి పందులు, దుప్పులు కనుజులు జింకలు, కొండగొర్లు, అడవి దున్నలు, అలాగే పాకాల అభయారణ్యానికి అటవీ ప్రాంతంలో సుమారు 200 పక్షులకు పైగా అటవీ ప్రాంతంలో సురక్షితంగా సంచరిస్తున్నాయి. గూడూరు అటవీశాఖ డివిజనల్ అధికారి వి.చంద్రశేఖర్ రావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అటవీ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది వాకి టాకీలు తద్వారా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. గూడూరు రేంజ్ అధికారి బి.సురేష్, కొత్తగూడ రేంజ్ అధికారి వజహద్, గంగారం రేంజ్ అధికారి చలపతిరావు, ఆయా రేంజ్‌ల పరిధిలోని డిప్యూటీ రేంజర్లు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

**వన్యప్రాణుల సంరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు :**
**అటవీశాఖ డివిజనల్ అధికారి వి.చంద్రశేఖర్ రావు**



వన్య ప్రాణుల సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు గూడూర్ డివిజనల్ అటవీశాఖ పరిధిలోని కొత్తగూడ, గంగారం, గూడూరు రేంజ్ పరిధిలో ప్రతిష్టమైన చర్యలను చేపట్టి వన్యప్రాణుల సంరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. పలుచోట్ల జంతువుల సంచారం ఎక్కువగా ఉన్నచోట సోలార్‌బోర్లు ఏర్పాటుచేసి కుంటల వద్ద నీటి నిల్వలను ఉంచి దాహాన్ని తీరుస్తున్నాం. జంతువుల కదలికలను ఎప్పుడు తప్పుడు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నాం. వేటగాళ్లను పూర్తిస్థాయిలో నియంత్రించాం. అటవీ జంతువులను అటవీ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది. వేటగాళ్లు ఎవరైనా అడవి జంతువులకు హాని చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు మూడు రేంజ్‌ల పరిధిలో ప్రతిష్టమైన క్షేత్రస్థాయిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని అందరి సహకారంతో అడవి జంతువులు స్వేచ్ఛగా అడవిలో సంచరిస్తున్నాయని తెలిపారు.

## బీఆర్ఎస్‌కు మాజీ మార్కెట్ వైస్ చైర్మెన్ రాజీనామా



నవతెలంగాణ-మహాదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కాయిత విఠల్ తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడిం చారు. మంగళవారం ఆయన విలేకరులకు విస్పష్టమైన ప్రకటన విడుదల చేశారు. రాజకీయాల కతీతంగా తాను సనాతన ధర్మం వైపు దృష్టిసారించి ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే తాను అనుసరిస్తున్న ఆధ్యాత్మిక ధోరణి నేపథ్యంలో రాజకీయాలకతీతంగా నడుచుకోవాలనే ధ్యేయంతో ఉన్నట్లు వివరించారు. రాజకీయాలకు తావు లేకుండా ప్రజలందరూ ఆధ్యాత్మిక భావనతో, ధార్మిక చింతనతో జీవితాన్ని కొనసాగించాలని కాయిత విఠల్ సూచించారు.


# నవతెలంగాణ

నమస్తే తెలుగు దినపత్రిక


5

జయశంకర్

# ములుగు - భూపాలపల్లి

బుధవారం మే 29, 2024 www.navatelangana.com


## రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : సీఐటీయూ, సీపీఐ(ఎం)



నవతెలంగాణ-ములుగు

విధి నిర్వహణలో ఉండగా ములుగు డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద లారీ ఢీకొట్టడంతో మృతిచెందిన ములుగు జిల్లా కేంద్రం గ్రామ పంచాయతీ కార్మికుడు బాల్గురి సారయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని, రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎండి గఫూర్ పాషా డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని మంగళవారం వారు పరామర్శించి మాట్లాడారు. రెక్కాడితే డొక్కాడని నిరుపేద దళిత కుటుంబానికి చెందిన సారయ్య లారీ ప్రమాదంలో మరణించడం బాధాకరమని అన్నారు. సారయ్య మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొర్ర రాజు, రత్నం ప్రవీణ్ పాల్గొన్నారు.

# వెంటనే పనులు ప్రారంభించాలి : మంత్రి సీతక్క



నవతెలంగాణ - ములుగు

కరకట్ట నిర్మాణ పనులు, మారేడుగుండ చెరువు కట్ట నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వరదల వల్ల ప్రాణనష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ దనసరి సీతక్క అన్నారు. మంగళవారం హైదారాబాద్ లోని అంబేద్కర్ సచివాలయంలో నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏటూరునాగారం మండల పరిధి రాంనగర్ గ్రామం నుండి మొదలుకొని మంగపేట మండలం పొదుమూరు వరకు కరకట్ట పనులు ప్రారంభించాలని అన్నారు. వర్షాకాలం లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అధికారులు ముంపు గ్రామాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఏటూరు నాగారం నుండి రామన్న గూడెం ఎక్కల వరకు నిర్మించిన కట్ట మరమ్మతులు తూముల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం కరకట్ట మరమ్మతుల కోసం కేటాయించిన రూ.6 కోట్లు కాంట్రాక్టర్లు జేబులు నింపుకున్నారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వంలో ఇలాంటివి ఉపేక్షించేది లేదని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పూర్తి స్థాయిలో పని చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని, ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని అన్నారు. గత వర్ష కాలంలో వెంకటాపూర్ మండలం లోని భుర్గుపేట మారేడుగుండ చెరువు కట్ట తెగి పోవడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన టెండర్ ప్రక్రియ పనులు పూర్తి చేసి చెరువు కట్ట నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు, ఎస్ఈలు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వివిధ విత్తనాల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, మందులు విక్రయించినట్లు తేలితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని అన్నారు. విత్తన షాపుల వారు అమ్మే ప్రతీ విత్తనానికి పురుగుమందులకు రసీదు ఇవ్వాలని అన్నారు. లేదంటే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. సీఐ నరేష్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ఎం సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు : ఏఈఓ మనిషా

నవతెలంగాణ-మల్హర్‌రావు

రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని ఏఈఓ మనిషా అన్నారు. మంగళవారం మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీ పని చేస్తున్న రైతుల వద్దకు వెళ్లి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. బీజీ-3 పేరుతో చలామణి అవుతున్న హెచ్‌టి పత్తి విత్తనాలకు జీఈఏసీ అనుమతి లేదని, ఈ రకం విత్తనాలు కొనడం, అమ్మడం సాగు చేయడం నేరమన్నారు. నిర్ణీత ఫార్మాట్ లో ఉన్న రసీదును మాత్రమే రసీదుగా అంగీకరించాలన్నారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. రసీదు పై విత్తన కంపెనీ పేరు విత్తన రకంపేరు, లాట్ నెంబరు, గడువు తేదీ డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు డబ్బాల్లో ఉన్న విత్తనాలను, గడువు దాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేసి మోసపోవద్దని రైతులకు సూచించారు.

### 'నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు'

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

నకిలీ విత్తనాలు అమ్మినా, అధిక రేట్లకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అశోక్, ఏఓ సురేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను వారు ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనాల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడువు ముగిసిన విత్తనాలు, లేబుల్స్ లేనివి, లూజ్ విత్తనాలు, నిలువ ఉంచిన విత్తనాలు అమ్మినా చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామన్నారు. విత్తనాలు కొన్న తరువాత రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకుని భద్రపరచుకోవాలని సూచించారు. రైతులు అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఎరువులు, విత్తనాల ధరల పట్టికను ఏర్పాటు చేసి లైసెన్స్ వివరాలు నమోదు చేయాలన్నారు. విత్తనాల కొనుగోళ్లలో రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే డయల్100 ద్వారా గానీ, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారమిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి


మండల వ్యవసాయ అధికారి ఎం సంతోష్



నవతెలంగాణ- ములుగు

రైతులు లైసెన్సు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, తప్పకుండా బిల్లు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం సంతోష్ అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని విత్తన దుకాణాలను తనిఖీలు చేశారు. అనంతరం జగ్గన్నపేట్ శివారు గ్రామం పులిగుండ గ్రామంలో రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గుర్తు తెలియని వక్తులు విత్తనాలు తిరిగి అమ్మితే కొనకూడదని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండి అధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. సరైన వర్షపాతం నమోదైతే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు.

## మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన



నవతెలంగాణ-మహాదేవపూర్

అంబటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మహదేవపూర్, పలిమెల మండలాల్లోని హెల్త్ వెల్నెస్ సెంటర్స్‌లో మహిళలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. స్థానిక వైద్యాధికారి నిహారిక పాల్గొని మాట్లాడారు. క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, కౌమార దశలో వచ్చే శారీరక మార్పుల పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆరోగ్య సంబంధిత కౌన్సిలింగ్ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గానీ, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని గాని హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో గాని సంప్రదించాలని సూచించారు. అంబటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రామారావు, హెచ్ఈఓ మురళీధర్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ మాసుక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సూపర్వైజర్ ఏఎన్ఎంలు కనకదుర్గ, శైలజ, సుజాత, శ్రీలత, బ్యూలా, పుష్ప పాల్గొన్నారు.



**గణపురం :** మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా 15 నుండి 45 ఏండ్లలోపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ మహిళలు తప్పనిసరిగా ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



నవతెలంగాణ-భూపాలపల్లి

జూన్ 1వ తేదీ వరకు ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ ఎన్నికల కార్యాలయం నుండి జూన్ 4వ తేదీన నిర్వహించనున్న పార్లమెంట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి రౌండ్‌కు ఎన్ కోర్ లో అప్ లోడ్ చేయాల్సి ఉన్నందున ఇంటర్ నెట్ ఏర్పాటు చేయాలని అన్నారు. డేటా ఎంట్రీ వేగంగా చేసేందుకు పర్యవేక్షణకు సీనియర్ అధికారిని నియమించాలని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విధులు కేటాయించిన సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేష్ మిశ్రా ఆర్డీఓకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయపు వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎన్నికల ప్రధాన అధికారి, అదనపు ఎన్నికల అధికారులు లోకేష్ కుమార్, సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 30 వరకు సిబ్బందికి విధులు కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసి సన్నద్ధం చేయడానికి విధులు కేటాయించిన ప్రతి ఒక్కరికి సమగ్ర సమాచారం అందచేయాలని అన్నారు. ఓట్ల లెక్కింపులో స్ట్రాంగ్ రూము నుండి ఈవీఎంలు తెచ్చే సిబ్బందికి ఒకే రంగు కలిగిన టీ షర్ట్స్ అందచేయాలన్నారు. లెక్కింపు తదుపరి వరంగల్ నుండి జిల్లాకు ఈవీఎం మెటీరియల్ తీసుకురావాల్సి ఉందని, రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని అన్నారు. పటిష్ఠ పోలీస్ బందోబస్తు, ఎస్కార్ట్ ఏర్పాటు నడుమ ఈవీఎం, వీవీ ప్యాట్ గోదాముకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

## బైండోవర్ చేయాలి : జిల్లా ఎస్పీ శబరీష్



నవతెలంగాణ- ములుగు

పంట పొలాలు, అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చే వారిని బైండోవర్ చేయాలని జిల్లా పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశించారు. మంగళవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారి నేర సమావేశం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు పరిశీలించి మార్గదర్శకాలు జారీ చేశారు. రానున్న వర్షాకాలంలో ములుగు జిల్లాకు వరద ముంపు పొంచి ఉన్నదని, గత అనుభవాల దష్ట్యా ప్రజల క్షేమం కోసం పోలీస్‌శాఖ తరపున తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆయా మండలాల ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు అమర్చాలని అన్నారు. అనధికారికంగా రహదారి వెంబడి ఇసుక లారీలు నిలిపితే కేసులు నమోదు చేయాలని, అవసరమైతే లారీలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ గితే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీఎస్పీ డీసీఆర్బీ రాములు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, సీఐలు రంజిత్‌కుమార్, రాజు, కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్, చల్ల రాజు, కమలాకర్, శ్రీకాంత్ రెడ్డి, కష్ణ ప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, రమేష్, రవికుమార్, అశోక్ పాల్గొన్నారు.

## నర్సరీలను అధికారిని సందర్శన



నవతెలంగాణ - ములుగు

ములుగు మండలం అబ్బాపురం గ్రామంలోని వివిధ నర్సరీలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జి అనసూయ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ లోని మొక్కలు, కోకోపీట్, ఇతర సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ యజమానులు నర్సరీ ఆక్ట్ మార్గదర్శనాల ప్రకారం అన్ని రికార్డ్స్ నిర్వహించామని తెలిపారు. రైతులు నర్సరీ లైసెన్స్ ఉన్న నర్సరీలలోనే నారు కొనాలని తెలిపారు. 45 రోజుల్లోపు మిరప నారుని మాత్రమే పొలంలో నాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి వేణు మాధవ్, నర్సరీ యజమానులు బుస ప్రవీణ్, యర కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

### గుడుంబా విక్రయదారులు 19మంది బైండోవర్

నవతెలంగాణ-గోవిందరావుపేట

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గుడుంబా తయారీ, విక్రయిస్తున్న 19మందిని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్టు ఎక్సైజ్ ఎస్సై లింగగౌడ్ మంగళవారం తెలిపారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 19మంది గుడుంబా తయారు చేస్తూ విక్రయిస్తున్నట్లుగా గుర్తించి వారిని తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సరళ ముందు బైండోవర్ చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ నిషేధిత మత్తు పదార్థం గుడుంబాను తయారుచేసినా విక్రయించినా చట్టరీత్యా నేరమని చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బందితోపాటు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

- టీడీపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మొక్కిరాల జనార్ధన్‌రావు



నవతెలంగాణ-భూపాలపల్లి

ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మొక్కిరాల జనార్ధన్‌రావు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్ధన్ రావు మాట్లాడుతూ.. సినీ పరిశ్రమలో కథానాయకుడిగా, రాజకీయాల్లో ప్రజానాయకునిగా తిరుగులేని చరిత్రలు సృష్టించి దేశంలో సంక్షేమ పాలనకు ఆద్యం పోసింది ఎన్టీఆర్ అని కొనియాడారు. 42 సంవత్సరాల క్రితం తెలుగుదేశం పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. జాతీయ రాజకీయాలలో ఎన్టీఆర్ విలువైన పాత్ర పోషించి తెలుగు వారి పలుకుబడిని పెంచి గర్వపడేలా చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ తీసుకొచ్చిన రాజకీయ, సామాజిక, ఆర్థిక విధానాల ఫలాలు తెలంగాణలో సైతం నేటితరం అనుభవిస్తున్నదని అన్నారు. ఎన్టీఆర్ ఆశయాల కోసం పని చేస్తూ తెలుగు వాడి ఆత్మగౌరవం అభివృద్ధిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మాచర్ల నగేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు దూడపాక సాంబయ్య తెలుగు యువత రాష్ట్ర నాయకులు బంటుపల్లి పాల్గుణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కోటి



నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మోత్కూర్ కోటి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఎంపీడీసీఎల్ కార్యాలయంలో ఎస్ఈ మల్చూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 25న డివిజన్ ఇంజినీర్లకు, 28న సూపరింటెండెంట్ ఇంజినీర్లకు వినతి పత్రాలు ఇచ్చామని, జూన్10న సీఎండీలకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. విద్యుత్ శాఖ కార్మికులు ఆర్టిజన్లు ఉద్యోగుల కన్వర్షన్ మీటర్ రీడర్లు, అన్‌మాన్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలన్నారు. జేఎల్ఎంలకు, రెగ్యులర్ ఉద్యోగులకు ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. సబ్ స్టేషన్లలో ఫోర్ ప్లస్ వన్ విధానం అమలు చేయాలని, నైట్ వాచ్‌మెన్‌లను రిక్రూట్మెంట్ చేయాలన్నారు. గత ప్రభుత్వం నుండి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదించామని, అయినా పరిష్కారం కావట్లేదని అన్నారు. దీంతో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ కోసారి భాస్కర్, జేఎల్ఎం రాజేందర్, పడితల విజేందర్, సురేందర్, పంతకని రావిందర్ ,చిక్కుల కుమారస్వామి, మోడెం సురేందర్, ముక్కెర రవి, రాంటెంకి సమ్మయ్య, రవీందర్, సమ్మన్న, హరిచందర్, సంపత్ మీటర్ రీడర్ తిరుపతి, రాములు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-మల్హర్‌రావు

చికిత్స పొందుతూ మండలంలోని ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు జక్కనపల్లి నరేష్(35) మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం...

ఆన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నరేశ్ ఈ నెల 21న అతని ఇంటివద్ద ఉన్న మామిడి చెట్టుపైకి ఎక్కి మామిడి కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడగా మెడకు బలమైన గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. మతుడి బావమరిది రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

# ముగిసిన మల్లూరు బ్రహ్మోత్సవాలు

- ఘనంగా వసంతోత్సవం





నవతెలంగాణ-మంగపేట

10రోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్న మం డలం లోని మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వసంతోత్సవంతో ముగి సాయి. ఈ సందర్భంగా భద్రాచల సీతారామచంద్ర స్వామి ఆలయం నుంచి వచ్చిన అమరవాది మురళి కృష్ణమాచా ర్యుల పురోహిత బృందం ఆలయంలోని మూలవిరాట్ విగ్ర హానికి, అభయాంజనేయ స్వామికి క్షేత్ర పాలకురాలు దైతకు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు సోమవారం రాత్రి ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లతో నరసింహస్వామికి నాగ వెల్లి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆ లయానికి వచ్చిన ప్రజలకు నాగవెల్లి ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఆదిలక్ష్మి చెంచులక్ష్మి, నరసింహ స్వామి ఉత్సవ మూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అ నంతరం వసంతోత్సవాన్ని ఘనంగా జరిపించి మల్లూరు బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు యాత్రికులు వేలాదిగా తరలొచ్చి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి కార్య నిర్వహణా అధికారి శనిగల మహేష్ ఆలయ అర్చకులు కైంకర్యం రాఘవాచారి, రాజశేఖర్‌శర్మ, పవన్ కుమారాచార్యులు, వెంకట నారాయణశర్మ, ఈశ్వర్ చంద్‌శర్మ, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ సీతారాములు, శేషు గణేష్ సిగ్గం పుల్లయ్య, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

భారత ప్రభుత్వం ఆమోదించిన అఖిల భారత పూర్వ సైనిక్ సేవా పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి సుబేదార్ మెజార్ పిఎస్ఎన్ స్వామి అద్వర్యంలో మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా రెండోసారి బేతోజు మురళీ కృష్ణ, ఉపాధ్యక్షుడుగా అభిషేక్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా దుబాసి సాగర్, సంయుక్త కార్యదర్శిగా బొమ్మరపు లక్ష్మణ్ రెడ్డి, కోశాధికారిగా గన్యారపు సురేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ... జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమం కోసం ఎల్లవేళల శ్రమిస్తానని, సంక్షేమ పథకాలు మాజీ సైనికులందరికి అందేలా కృషి చేస్తానని అన్నారు. అందుకు నియోజకవర్గ ఎమ్మెల్యే, జిల్లా యంత్రాంగం సహకారం తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు జనార్ధన్‌రెడ్డి, రత్నాకర్, రాజేందర్, సతీష్, రఘు, మాలోతు ఆషా, తధితరులు పాల్గొన్నారు.



## ఆదిరెడ్డి కుటుంబానికి రెడ్డి సంక్షేమ సంఘం పరామర్శ



నవతెలంగాణ-గణపురం

గణపురం మండలం చెల్పూరు గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యా యులు నరహరి ఆదిరెడ్డి ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గోపు జయపాల్ రెడ్డి, తెలంగాణ రెడ్డి బిడ్డ పత్రిక ఉత్తర తెలంగాణ ప్రతినిధి కామిడి సతీష్ రెడ్డి తదితరులు మంగళశారం పరామర్శించారు. ఆదిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపూ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తి నరహరి ఆదిరెడ్డి అని కొనియాడారు. వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఆది రెడ్డి మరణం తీరని లోటు అన్నారు. వారి సతీమణి వెంకట నరసమ్మకుమారులు మాధవ్ రెడ్డి మహిపాల్ రెడ్డి కుమార్తె రమాదేవితో పాటు రెడ్డి సంఘం నాయకులు ఆరే రాకేష్ రెడ్డి, చిట్టి రెడ్డి ప్రభాకర్ రెడ్డి,కామిడి శ్రీధర్ రెడ్డి,కష్టా రెడ్డి,వాసు దేవ రెడ్డి,మహదేవ్ రెడ్డి,సాంబశివ రెడ్డి, మహేందర్ రెడ్డి, గౌరు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మిత్రుని కుటుంబానికి తోటి మిత్రుల ఆర్థికసాయం

నవతెలంగాణ-గోవిందరావుపేట



రహదారి ప్రమాదంలో చనిపోయిన తన చిన్ననాటి స్నేహితుడు కుటుంబానికి తోటి స్నేహితులు మంగళవారం 25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిం చారు. 2002 -2003 పదవ తరగతి బ్యాచ్ అయిన విజయ్ యాక్సిడెంట్‌లో మృతిచెందారు. బాధిత కుటుంబానికి బ్యాచ్ తరపున మంగళవారం 25 వేల రూపాయల ఆర్థిక సాయం చేయడం జరి గింది. ఈ కార్యక్రమంలో బీరెడ్డి సాంబ శివ, గొంది రాజేష్, కందికట్ల దిలీప్, సతీష్ కుమార్, జిట్ట బోయిన రమేష్ మశిఖ రమేష్ , యానాల సీతారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ -తాడ్వాయి

భూపతిపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీ యువకుడు ఎట్టి కళ్యాణ్ గత ఆదివారం తునికాకు వెళ్తే అడవిలో పాము కరిచిన విషయం విధితమే. నవతెలంగాణ పత్రికలో 'తునికాకు కూలికి పాము కాటు.. పట్టించుకోని అటవీశాఖ' అనే శీర్షికన మంగ ళవారం వార్త ప్రచురితమైంది. అదే రోజు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుడుముల బక్కయ్య, మరో బీట్ ఆఫీ సర్ వెంకటేశ్వర్లు బాధితుడిని పరామర్శించారు. ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు బీట్ ఆఫీసర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతిపూర్ గ్రామ పెద్దలు తల్లడి లక్ష్మయ్య, తాటి మల్లయ్య,



నరసయ్య, వట్టం నరసయ్య, యూత్ నాయకులు పాయం కళ్యాణ్, యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ ఎఫెక్ట్

## ఘనంగా ఎన్టీరామారావు జయంతి



నవతెలంగాణ-గోవిందరావుపేట

మండల కేంద్రంలోని కమ్మ సంఘం కమ్యూనిటీ హాల్‌లో మంగళ వారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యానాల అనంతరెడ్డి, జంపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వల్లభనేనీ శ్రీను, నర్రా శివాజీ, వెంకట్రామయ్య అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు కమ్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగ వరపు ప్రసా రావు, కొండపల్లి రాంచందర్‌రావు, నర్సంపేట అభిమానులు, నర్సింగరావు, సూర్య ప్రకాష్, ఏటూరునాగారం, మంగపేట అభిమానులు లాలయ్య కొడవలి రఘు, గోవిందరావు పేట కమ్మ సంఘం అధ్యక్షుడు పాలడుగు ఉమా మహేశ్వరరావు, వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న అభిమానులు, మహిళా వీరాభిమాని కొమ్మరాజు ఉమ తదితరులను సన్మానించారు. అనంతరం సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-గణపురం

మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన కుర్రి లక్ష్మి అనారోగ్యంతో మతి చెందింది. బాధిత కుటుంబానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం పంపిణీ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా పే బ్యాక్ సొసైటీ నినాదంతో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కుర్రి సంపత్ అధ్యక్షతన బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో గడ్డం సాదయ్య, కుర్రి సారంగం, కండె రవి మహారాజ్, దూడపాక శ్రీనివాస్, కుర్రి ఐలన్న, సామర్ల నరేష్, సభ్యులు కుర్రి శంకర్, లాదల్ల భిక్షపతి, సోమిరె డి దిలీప్, గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి రౌతు మురళి, కార్యదర్శి కడారి గణేష్, కుర్రి రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత యజమానికి బంగారు గొలుసు అప్పగింత



నవతెలంగాణ-గోవిందరావుపేట

రైతు పోగొట్టుకున్న బంగారు గొలుసును వెతికి జాడ తెలుసుకొని పసర పోలీసులు తిరిగి యజమానికి అప్పగించారు. పస్రా పోలిస్ స్టేషన్ ఎస్ఐ ఏ కమలాకర్ కథనం ప్రకారం మంగళవారం మేడారం గ్రామానికి చెందిన రైతు సిడిం లక్ష్మయ్య తన దగ్గర ఉన్న రెండు తులాల బంగారు గొలుసును బ్యాంకులో తాకట్టు పెట్టేందుకు వెళ్లాడు. బ్యాంకులో పని కాక పోవడంతో తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో లక్ష్మయ్య బంగారు గొలుసును పోగొట్టుకోవడం జరిగింది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై కమలాకర్ తన సిబ్బందితో అన్నిచోట్ల వెతికి ఆరా తీయగా గ్రామానికి చెందిన వెలిశాల ధనమ్మకు దొరికిందని సమాచారం అందింది. దీంతో పోలీసులు ధనమ్మ ను సంప్రదించగా ఆమె సానుకూలంగా స్పందించి తనకు దొరికిన బంగారు గొలుసును పోలీసులకు అప్పగించింది. దానిని ఎస్సై కమలాకర్ బాధితునికి అందజేశారు. దొరికిన గొలుసును అప్పగించిన ధనమ్మను అభినందించగా, బాధితుడు పోయిన గొలుసు దొరికినందుకు పోలీసులకు కృతజ్ఞత తెలుపుతూ హర్షం వ్యక్తం చేశాడు.

## జీపీ ట్రాక్టర్ ను ఢీకొట్టిన ఇసుక లారీ

### అక్కడికక్కడే మృతిచెందిన జీపీ కార్మికుడు

### మరో ముగ్గురు కార్మికులకు తప్పిన ముప్పు

నవతెలంగాణ - ములుగు



గ్రామ పంచాయతీ కార్మికులు చెత్త సేకరిస్తుండగా ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఇసుక లారీ ఢీకొట్టడంతో కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన ములుగు జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, జీపీ కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు లోని ఎస్సీ కాలనీకి చెందిన బల్గూరి సారయ్య(52) గతంలో హమాలీ కార్మికునిగా పట్టణ వాసులకు సుపరిచితుడు. గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా కొన్నేళ్ల క్రితం నుంచి పనిచేస్తున్న సారయ్య మంగళవారం సాయంత్రం చెత్త సేకరించేందుకు ట్రాక్టర్ ను డ్రైవ్ చేస్తూ మరో ముగ్గురు కార్మికులు పైడి, రాజేందర్, వెంకన్న తో కలిసి డీఎల్ ఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా జాతీయ రహదారిపై చెత్త సేకరిస్తున్నారు. ఎన్‌హెచ్‌పై నాటిన మొక్కల మధ్య పెరిగిన గడ్డిని తొల గించగా దానిని సేకరిస్తుంగా సారయ్య ట్రాక్టర్ ట్రాలీలో ఉండి నేర్పు తున్నాడు. అయితే ములుగు నుంచి ఏటూరునాగారం వైపు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న సారయ్య ఎగిరిపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెం దాడు. తోటి కార్మికులు చెత్త సేకరిస్తుండగా తాము సైతం ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. కాగా, జీపీ అధికారులు, సిబ్బంది పోలీ సులకు సమాచారం ఇవ్వగా ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్ స్టేషన్ కు తరలించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. కార్మికుడి మృతిపట్ల జీపీ కార్యదర్శి రఘు, కార్మికులు, మాజీ పాలకవర్గం సభ్యులు నివాళులర్పించి, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్మికుని మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు.

## నిరుపేద బిడ్డకు అండగా 'అయిలి మారుతి'



నవతెలంగాణ-మహాదేవపూర్

భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం ఎన్కపల్లి గ్రామానికి చెందిన జిల్లారపు మల్లిక వెంకటస్వామి దంపతుల కూతురు శ్రీవాణి ఇటీవల ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తలకు త్రీవ గాయం, ఒక చెయ్యి విరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సహాయం కోసం నవ తెలంగాణ పత్రికలో వచ్చిన వార్తకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మంగళవారం స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం చేసి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరతి పోషన్న, బల్ల సంపత్, మస్కరాజు, బి.సంతు, హసీ, వర్షిత్, తదితర సభ్యులు పాల్గొన్నారు.



## ఎన్ఎంఎంఎస్‌కు స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

మండలంలోని మొట్లపల్లి జెడ్పీహెచ్ఎస్ 8వ తరగతి విద్యార్థులు గోనె రేష్మ, మహ్మద్ ఆఫీఫా తబుసం, మునిగాల స్టైయిన్స్ దినకరన్, నర్రావుల రాకేష్ నేషనల్ మీన్స్ కం మెరిట్(ఎన్ఎంఎంఎస్) స్కాలర్షిప్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరం ప్రభుత్వం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ టాలెంట్ పరీక్షకు పాఠశాల నుండి ఏకంగా నలుగురు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాల ప్రతిభకు నిదర్శనమన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున 4 సంవత్సరాలకు 9,10,11, 12వ తరగతులకు గాను రూ.48వేల ఉపకార వేతనం ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం ఉపకార వేతనానికి ఎంపికైన నలుగురు విద్యార్థులతో పాటు గైడ్‌గా వ్యవహరించిన ఉమారాణి, వీరయ్య, ఉపాధ్యాయ బృందంను, ఎస్ఎస్సి 2024 పరీక్ష ఫలితాలలో పాఠశాల నుండి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించిన వడ్డేపల్లి పవిత్ర, మెండు జయఆదిత్య, జన్నే రోహిత్, ఎండి రజాక్, నాగపురి అక్షితలు పాఠశాల మొదటి ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సదానందం, ఉపాధ్యాయులు నరసింహస్వామి,సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, గ్లోరీ రాణి, రవీందర్, శ్రీధర్ స్వామి, మధుసూదన్, రాజయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## అవమానించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : సురేందర్

నవతెలంగాణ-మంగపేట

తన ప్రమేయం లేని విషయంలో దుర్భాషలాడుతూ గ్రామ ప్రజల ముందు అవమానించిన అధికార పార్టీ నాయకుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని మండలంలోని భిక్షంపేట గ్రామానికి చెందిన దళిత నాయకుడు ఈసంపల్లి సురేందర్ డిమాండ్ చేశాడు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. బిక్షంపేట గ్రామానికి చెందిన ఎర్ర వెంకన్న 15 రోజుల క్రితం మద్యం మత్తులో కాంగ్రెస్ పార్టీ నాయకులను దూషించాడని మంగళవారం అతన్ని పంచాయతీకి పిలిపించి నిలదీశారు. హనుమాన్‌మాలలో ఉన్న తనను అక్కడకు వెళ్లి జరుగుతున్న విషయాన్ని గమనిస్తు తప్పు చేశానని ఒప్పుకుంటున్న వ్యక్తికి శిక్ష వేసి వదిలేయండని అన్నందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన పగిడిపల్లి వెంకటేశ్వర్లు దాడికి యత్నించాడని ఆరోపించారు. వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలన్నారు.

## బడుల పునర్ ప్రారంభం నాటికి....

# పనులు పూర్తయ్యేనా ?

### మండలంలో 19 అమ్మ ఆదర్శ పాఠశాలలు ఎంపిక



నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ అభివద్ధి కమిటీలను ఇటీవల నియమించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాట్ల కోసం మరమ్మతుల పనులు చేపట్టడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. మరుగుదొడ్లు, పాఠశాల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలు నాటడం, ఎత్తు పల్లాలు లేకుండా పాఠశాల ఆవరణను ఉపాధి హామీ పనులు చేపట్టి మట్టితో నింపడం, విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి వీలుగా వాషింగ్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేయడం, ఫ్యాన్స్, విద్యుత్ సరఫరా, ట్యూబ్ లైట్స్, ఫ్లోరింగ్ తదితర అభివద్ధి పనులు చేపట్టి పాఠశాల పునర్ ప్రారంభం నాటికి పనులను పూర్తి చేసి పాఠశాలలను ఆహ్లాదకరంగా తయారు చేయాల్సి ఉంది. కానీ, పనులు నత్తనడకన సాగుతుండడం గమనార్హం.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలో 5 జిల్లా పరిషత్, 27 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, ఒక ఆదర్శ, ఒక కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలు మొత్తం 37 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మొత్తం విద్యార్థులు 18,52 విద్యానభ్యసిస్తున్నారు. ఇందులో 19 పాఠశాలలు అమ్మ ఆదర్శ అభివృద్ధికి ఎంపిక కాగా అభివద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.1.25కోట్ల ప్రత్యేక నిధులు మంజూ




రు చేసింది. తాడిచెర్లలో మూడు ప్రాథమిక పాఠశాలలు ఎస్సీ కాలనీ పాఠశాలకు రూ.4.50లక్షలు, జీపీ పక్కన పాఠశాలకు రూ.6.20లక్షలు, బీసీ కాలనీ పాఠశాలకు రూ.6.25 లక్షలు, దబ్బగట్టు పాఠశాలకు రూ.1.96లక్షలు, శభాస్‌నగర్ పాఠశాలకు రూ. 3.49లక్షలు, పాత రుద్రారం పాఠశాలకు రూ.3.12 లక్షలు, ఇప్పలపల్లి పాఠశాలకు 6.95లక్షలు, పివి నగర్ పాఠశాలకు రూ.6.68లక్షలు, జంగిడిపల్లి పాఠశాలకు రూ.8.25లక్షలు, కొండం పేట పాఠశాలకు 8.70లక్షలు, మల్లంపల్లి 5.15లక్షలు, నాయకపుపల్లి పాఠశాలకు రూ.6.43లక్షలు, రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.19.05లక్షలు, పెద్దతూండ్ల జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.15.30లక్షలు, చిగురుపల్లి పాఠశాలకు రూ.8.20లక్షలు, నారాయణపల్లి పాఠశాలకు రూ.6.25లక్షలు, పెద్దతూండ్ల ప్రాథమిక పాఠశాలకు రూ.7.80లక్షలు, ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌కు రూ.15.80లక్షలు మంజూరు చేశారు. మరమ్మతుల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పాఠశాలలు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఇటీవల భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాఠశాలల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి గుత్తేదారులను, సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ, పనులు నత్తనడకన సాగుతుండడంతో పాఠశాలల పునర్ ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేనా అని మండల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## జూన్ 4న కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ - ములుగు

జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ములుగు జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రాతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలని, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే అనుమతించాలని అన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాల్ లో నిర్దేశిత రౌండ్ల వారీగా




కౌంటింగ్ కట్టు దిట్టంగా పూర్తి చేయాలని, ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత సంబంధిత టేబుల్ ల కౌంటింగ్ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అనంతరం ఈవిఎం యంత్రాల ఓటింగ్ లెక్కింపు ప్రారంభించాలని అన్నారు. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద ఫలితాలు ప్రకటించేందుకు ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు



చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్‌కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేసుకోవాలని అన్నారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ కౌంటింగ్ సక్రమంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, అనీష్ ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో జీలుగ విత్తనాలు

### వ్యవసాయశాఖ అధికారి ఎం ప్రభావతి అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్లు ధర్మేంద్ర, రచన

నవతెలంగాణ-మహదేవపూర్

మహాదేవపూర్ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు రాయితీపై పంపిణీ చేయడానికి జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారి ఎం ప్రభావతి అసిస్టెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్లు ధర్మేంద్ర రచన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30కిలోల జీలుగా బస్త ధర రూ.2790 కాగా రాయితీ పై రైతులకు రూ.1116కు అందించడం జరుగుతుందని అన్నారు. కావాల్సిన రైతులు పట్టా పాస్‌బుక్,



ఆధార్ కార్డు జీరాక్స్‌లతో సంప్రదించాలని అన్నారు. జీలుగతో అనేక లాభాలున్నాయని అన్నారు. సౌడు భూములను పునరుద్ధరిస్తుందని, నేలను గుల్లగా మార్చి నేలలో నీరు ఇంకే గుణం పెంచుతుందని అన్నారు. నేలలో క్లిష్ట రూపంలో ఉన్న లభ్యం కాని పోషకాలు లభ్యమయ్యేలా చేస్తుందన్నారు. నేల భౌతిక స్థితి మెరుగు పడుతుందన్నారు. మట్టిలోని పోషకాలు కొట్టుకు పోకుండా కాపాడుతుందని అన్నారు. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను నెల పై పొరల్లోకి తీసుకువచ్చి పంటకు అందుబాటులో ఉంచుతుందన్నారు. కలుపు మొక్కలు పెరగకుండా నిరోధిస్తుందని అన్నారు. ఈ జీలగ విత్తనాలను దుక్కి దున్నిన తర్వాత ఎకరాకు 10 నుండి 12 కిలోల విత్తనాన్ని చల్లి, తర్వాత 40 రోజులకు పూత దశలో కలియదున్ని, త్వరగా కుళ్లడానికి 3 బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలని సూచించారు. తద్వారా నేల సారవంతంగా మారి దిగుబడులు అధిక శాతం వస్తాయని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
బుధవారం | మే 29, 2024 | www.navatelangana.com

## వర్కర్స్ కమిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా మహేష్

నవతెలంగాణ కాశిబుగ్గ



జాతీయ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ వరంగల్ జిల్లా కార్యనిర్వాక అధ్యక్షునిగా నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన అడుప మహేష్ నియమితులయ్యారు. మంగళవారం నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ ఫౌండర్స్, జాతీయ అధ్యక్షుడు గుర్విందర్ మెహతా ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షబ్బీర్‌అలీ మహేష్‌కు నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ మహేష్ 25ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తూ సాధారణ కార్యకర్త స్థాయి నుండి పీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ స్థాయికి ఎదిగారని అన్నారు. ఆయన సేవలను గుర్తించిన నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ ఆయనను వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్టు తెలిపారు. అనంతరం అడుప మహేష్ మాట్లాడుతూ తానకు వచ్చిన పదవిని ఒక హెూదాగా కాకుండా బాధ్యతగా భావించి పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి కషిచేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వర్కర్స్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు షబ్బీర్ అలీ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు కతజ్ఞతలు తెలియజేశారు.

### ఎన్టీఆర్ 101వ జయంతి

**కాశిబుగ్గ :** తెలుగు సినిమా రంగాన్ని, దేశ రాజకీయ రంగాన్ని మలుపు తిప్పి నూతన చరిత్రకు నాంది పలికిన మహెూన్నత వ్యక్తి ఎన్టీ రామారావు అని టిడిపి సీనియర్ నాయకుడు, 14వ డివిజన్ అధ్యక్షుడు పాషికంటి రమేష్ అన్నారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ లో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను పాషికంటి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పిల్లలకు, కాలనీవాసులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి డివిజన్ ఉపాధ్యక్షుడు ముంద్రాతి శరత్, కార్యదర్శి లాసాని నర్సింగరావు, ఎన్టీఆర్ నగర్ అభివద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్ట నగేష్, కోశాధికారి ఆర్మూర్ కుమార్, ప్రతినిధులు ల్యాగల బిక్షపతి, ఈర్ల రాజు, ఓర్సు అంజయ్య, జమండ్లపురి కష్ణమూర్తి, తౌటి వీరమల్లు, డాక్టర్ రాజేందర్, అశోక్ పాల్గొన్నారు.

### బీసీ వర్గీకరణ వర్తింపజేయాలి

**నర్సంపేట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ వర్తింపజేయాలని మేదరి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శేర్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగాలలో వర్గీకరణ అమలు అయినట్లు పంచాయతీ రాజ్, మున్సిపల్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్, కార్పొరేటర్‌ల స్థానాలకు కూడా వర్తింప జేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీలలో 130 కులాలు ఉండగా కేవలం ఐదారు కులాల మాత్రమే స్థానిక సంస్థల్లో ప్రతినిధులుగా ఎన్నికై అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. అట్ట డుగు స్థానంలో ఉన్న సంచార కులాలు, వృత్తి కులాలతో పాటు వందకు పైగా పద వులు దక్కన పరిస్థితి ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలలో ఏబీసీడీ వర్గీకరణపై నిర్ణయం తీసుకున్నాకే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బీసీలలోని అట్టడుగు కులాలను ఏకం చేసి పోరాడుతామని తెలిపారు.

### విద్యార్థులకు ఆర్టీసీ ఎండీ గుడ్ న్యూస్

**హసన్‌పర్తి :** టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పారు. వరంగల్‌లోని టీజీఎస్ ఆర్టీసీ ఐటీఐ కళాశాలలో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్, పేయింటర్ వంటి ట్రేడ్‌లలో ప్రవేశాలు జరుగుతు న్నాయని తెలిపారు. వివిధ కోర్సులలో అడ్మిషన్ పొందగోరె విద్యార్థులు జూన్ 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

### రవాణశాఖలో జూన్ 1నుంచి కొత్త రూల్స్

#### మైనర్లు పట్టుబడితే రూ.25వేల జరిమానా..

**హసన్‌పర్తి :** జూన్ 1వ తేదీ నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రానుండగా, భారీగా జరిమానాలు విధించనున్నట్లు ట్రాఫిక్ ఫోలసులు చెబుతున్నారు. అతివేగంతో వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.1వేయి నుంచి రూ.2 వేల వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500 జరిమానా వేస్తారు. మైనర్ వాహనం నడిపితే రూ.25 వేలు ఫైన్ వేస్తారని ట్రాఫిక్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో పాటు మైనర్‌కి 25ఏళ్ల వయసు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందకుండా ఆంక్షలు విధించనున్నట్లు తెలిపారు.

### ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**పర్వతగిరి :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారులో ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ,తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, బండి రికార్డు లేని వాహనాదారులకు జరిమానా విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బండి రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు.

### రేపు మండల సభ

**పర్వతగిరి :** ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.మండలం లోని ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, ప్రత్యేక అధికారులు,వివిధ శాఖల అధికారులు సకాలంలో సమావేశమునకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహణకు ఏర్పాట్లు

### రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్య

నవతెలంగాణ-వరంగల్



జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహణకు కట్టుదిట్ట మైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి. ప్రావీ ణ్య తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్ని కల అధికారి వికాస్ రాజ్ ఇతర రాష్ట్ర స్థాయి ఉన్న తాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వా రా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమా వేశంలో జిల్లా కలెక్టరేట్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, జీడబ్ల్యూ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖేడే, అదనపు కలెక్టర్ సంధ్యా రాణిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఏ నుమముల మార్కెట్ యార్డు లో నిర్వహించే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసంబ్లీ సెగ్మెంట్ల కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, ఫలితాలు వెల్లడించేందుకు మీడియాకు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి కౌంటింగ్ హాలులో అవసరమైన మేరకు కౌం టింగ్ టేబుళ్లు, ప్రతి టేబుల్కు నిర్దేశిత సిబ్బం దిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి పొర పాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధి కారి వికాస్ రాజ్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వ హించు పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కు సకల ఏర్పాట్లు పూర్తిచేయాలని, కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవస రమైన సౌకర్యాలు, పటిష్ట బందోబస్తు కల్పించా లని అన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభ మవుతుందని, అనంతరం ఈవిఎం యంత్రాల ఓటింగ్ లెక్కింపు ప్రారంభించాలని అన్నారు. ఎన్ని కల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటి స్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధి కారులు సమన్వయం తో పనిచేయాలని సూచిం చారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల ప్రక టన అనంతరం ఈవీఎం యంత్రాలను గోడౌన్ కు తరలించేందుకు అవసరమైన వాహనాలను సన్న ద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ సీదాం దత్తు పాల్గొన్నారు.

## వలుస చోరీలకు పాల్పడతున్న దొంగ అరెస్టు

నవతెలంగాణ-వరంగల్




సొంత ఇంటి నిర్మాణంతో పాటు దుబాయ్‌కు వెళ్లేందుకు చోరీలకు పాల్పడతున్న అంతర్ జిల్లా దొంగను సీసీఎస్, మట్వాడ పోలీసులు సంయు క్తంగా కలిసి అరెస్టు చేసారు. అరెస్టు చేసిన నిందితుడి నుండి సుమారు రూ. 22లక్షల విలువైన 270 గ్రాముల బంగారు అభరణాలతో పాటు, రెండు ద్విచక్రవాహనం, రూ. 50వేల నగదు, ఒక మోబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరాలను వెల్లడించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మండలం, సంకేపల్లి గ్రామం, ప్రస్తుతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో నివాసముంటున్న జింక నాగరాజు ద్విచక్ర వాహన మెకానిక్‌గా పని చేస్తూనే ద్విచక్ర వాహనాల క్రయవిక్రయాలతో వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోక పోవడంతో పాటు మరింత పెద్ద మొత్తంలో డబ్బును సులభంగా సంపాదిం చాలనే ఆలోచనతో ద్విచక్రవాహనాలు చోరీ చేసి వాటిని అమ్మి డబ్బును జమ చేయలనుకున్నాడు. 2011 నుంచి ఇప్పటి వరకు పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నాడు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు వరంగల్ సీపీ అదేశాల మేరకు ట్రైనీ ఐపిఎస్ శుభం నాగ్ అధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీలు జరిగిన ప్రదేశాల్లో పోలీసులకు లభించిన అధారాలతో పాటు ప్రస్తు తం పోలీసుల వద్ద వున్న టెక్నాలజీని వినియోగించి నిందితుడుని గుర్తించిన పోలీసులు నిఘా ఏర్పాటు చేసారు. ఇందులో భాగంగా మంగళవారం నిందితుడు చోరీ చేసిన బంగారు అభరణాలను అమ్మేందుకు ద్విచక్రవాహనంపై వస్తున్నట్లుగా పోలీసులకు పక్కా సమాచారం రావడంతో నిందితుడి పట్టుకోనేందుకు మట్వాడా, సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా ఆర్.ఎన్.టి రోడ్డు వాహన తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. నిందితుడుని పట్టుకోవడంలో ప్రతిభ కన భరిచిన ట్రైనీ ఐపిఎస్ శుభం నాగ్‌తో పాటు సెంట్ర ల్ జోన్ డిసిపి అబ్దుల్‌బారీ, అదనపు డిసిపి రవి, వరంగల్ ఎసిపి నందిరాంనాయక్, సిసిఎస్, మ ట్వాడా ఇన్స్‌స్పెక్టర్లు అబ్బయ్య, గోపి, అసిస్టెంట్ అనాటికల్ అఫీసర్ సల్మాన్‌పాషా, సిసిఎస్ ఏ ఎస్ఐ శివకుమార్, హెడ్‌కానిస్టేబుళ్ల నజీం, ఆ హ్మద్, జంపయ్య, కానిస్టేబుళ్ళు మధుకర్, రాము లు, వెంకన్న,కిరణ్‌కుమార్, నజీరుద్దీన్, శ్రీకాంత్‌తో పాటు మట్వాడా ఎస్.ఐ కుమార్ కాని స్టేబుళ్ళు అలీ, హరికుమార్, రాజేందర్,ఐటీకోర్ టీం కానిస్టే బుళ్ల నగేష్, ప్రవీణ్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

### మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-శాయంపేట

మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన దురిశెట్టి కుమారస్వామిపై కోతుల మందదాడి చేయడంతో కింద పడగా తలకు తీవ్ర గాయమై మరణించాడు. గండ్ర దంపతులు ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పసుల ప్రవీణ్, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి ఆదిరెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రూ.2000నగదు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండా నారాయణరెడ్డి, రాజు, మొగిలి, తిరుపతిరెడ్డి, రమేష్, సాంబరాజు, రవీందర్, రమేష్, శివ, సాంబయ్య, రాజయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

నవతెలంగాణ-చెన్నారావుపేట

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు ఉన్నాయని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి తెలిపారు.మంగళవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ పంటల కాలానికి రైతులకు సరిపడా జీలుగ విత్తనాలు సొసైటీలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందుకుగాను జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొని సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.